ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 29.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 249 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



ఛాన్స్ ఎవరికి..? 12



పల్లెల్లో 'పంచాయతీ' హోరు

తమ పాలన పట్ల రెండేండ్ల తర్వాత కూడా ప్రజలలో పూర్తి విశ్వాసం ఉందని రుజువు చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పంచాయతీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఆరు గ్యారంటీలను గ్రామస్థాయిలో ప్రచారం చేసేందుకు వర్గాలు సిద్ధమవుతున్నారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికలలోనూ, ఉప ఎన్నికలలోనూ చతికిలపడింది. అయితే, తమ బలం తగ్గిపోలేదని, ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని ఈ పంచాయతీ ఎన్నికలలో నిరూపించాలని పట్టుదలతో ఉన్నారు. బీజేపీ ఇక తన స్పీడ్ మరింత పెంచాలన్న ఆలోచనలో ఉంది. అందుకు పంచాయతీ ఎన్నికలను వేదికగా ఉపయోగించుకోవాలని వ్యూహాలు రచిస్తోంది.

ప్రధాన పార్టీల మూడు ముక్కలాట

కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రత్యేక వ్యూహాలు

- విజయం కోసం పోటాపోటీగా ప్రయత్నాలు
- ప్రజల విశ్వాసమే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ
- ఆరు గ్యారంటీల మీద సడలని విశ్వాసం
- పట్టు నిరూపణ కోసం గులాబీ పార్టీ తపన
- తమ హయాంలో పథకాల మీద నమ్మకం
- ప్రత్యామ్నాయ శక్తి యోచనలో బీజేపీ
- గ్రామీణ ప్రాంతాలలో బలం పెంచుకునే యోచన
- గ్రామాలను చుట్టేస్తున్న పార్టీల నేతలు
- క్రమంగా రాజకీయంగా వేడెక్కుతున్న పల్లెలు

వడ్లకొండ సదానందం

ప్రతిపక్షం ఉత్తర తెలంగాణ ప్రతినిధి, నవంబర్ 28 : తెలంగాణ పల్లెలలో పంచాయతీ ఎన్నికల సమరం కొనసాగుతుంది. దాదాపు 12,760 పంచాయతీలకు సర్పంచ్‌లు, 1,12,534 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మూడు విడతలలో ఈ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తొలి విడత ఎన్నికలు డిసెంబర్ 11వ తేదీన జరగనుండగా, రెండో విడతను డిసెంబర్ 14వ తేదీన, మూడో విడత ఎన్నిక డిసెంబర్ 17వ తేదీన నిర్వహించనుంది. పార్టీలకు అతీతంగా ఈ ఎన్నికలు

..:: మిగతా 2లో

'పంచాయతీ'కి హైకోర్టు సై

ఎన్నికలకు ధర్మాసనం గ్రీన్ సిగ్నల్

పోలింగ్ పై స్టే ఇచ్చేందుకు నిరాకరణ



- ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది
- ఈ దశలో మేము జోక్యం చేసుకోలేం
- పిటిషనర్లకు స్పష్టం చేసిన హైకోర్టు బెంచ్
- ఏబీసీడీల వారీగా బీసీ రిజర్వేషన్ కావాలి
- అప్పటివరకు ఎలక్షన్‌ను నిలిపివేయండి
- కోర్టును అభ్యర్థించిన పలు బీసీ సంఘాలు
- అది ఇప్పుడు కుదరదని చెప్పిన ధర్మాసనం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబరు 28 : తెలంగాణలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 46పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ తీర్పు ఇచ్చింది. పలు బీసీ సంఘాలు గురువారం నాడు హైకోర్టులో ఎన్నికలపై స్టే కోరుతూ పిటిషన్ దాఖలు చేసాయి. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కులాలకు (ఎంబీసీ) రిజర్వేషన్లు కేటాయించాలని, అప్పటివరకూ ఎన్నికల నిర్వహణ నిలిపివేయాలని వారు హైకోర్టును కోరారు. బీసీలలోని ఎ, బి, సి, డి వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్ విచారణ చేపట్టిన హైకోర్టు ఇదివరకే తెలంగాణలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మొదలైనందున, ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని స్పష్టం చేసింది. పంచాయతీ ఎన్నికలు మూడు దశలలో

..:: మిగతా 2లో

సర్పంచ్‌పదవి చాలా కాస్ట్లీ గురూ!

- గిరిజన పంచాయితీ జోగుగూడెంలో వేలం
- 20 లక్షలకు బహిరంగ పాట పాడిన ఓ నేత
- గద్వాల మండలంలోనూ జోరుగా వేలం

..:: 3లో



4, 5 తేదీలలో భారత్‌కు పుతిన్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారైంది. 23వ భారత్-–రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన డిసెంబర్ 4, 5 తేదీలలో భారతదేశంలో పర్యటించనున్నారు.

11



ఆధార్ కార్డుతో బర్త్ సర్టిఫికేట్స్ జారీ రద్దు

ఆధార్ విషయంలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. బర్త్ సర్టిఫికేట్ జారీ కోసం ఆధార్ కార్డులను రుజువుగా ఆమోదించబోమని పేర్కొన్నాయి.

11



బీఆర్ఎస్ కొత్త డ్రామా ఆడుతోంది

ఉనికిని నిలబెట్టుకునేందుకు 'దీక్ష' నాటకం

- కేసీఆర్ ఒక్కడి వల్లనే తెలంగాణ రాలేదు
- నాలుగు కోట్ల ప్రజల ఆందోళనతోనే రాష్ట్రం
- ఆవేదన చూడలేక సోనియాగాంధీ నిర్ణయం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబరు 28: రాష్ట్రంలో ఉనికి కోల్పోతున్న బీఆర్ఎస్ నేతలు తమ ఉనికిని చాటుకునేందుకు కొత్త డ్రామాకు తెరలేపారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్షపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ వల్లనే తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని, దీక్ష పేరుతో నాటకం ఆడారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు ఏం వచ్చిందని ప్రశ్నించారు. నాలుగు కోట్ల మంది ప్రజలు చేసిన ఆందోళనలతో సోనియాగాంధీ తెలంగాణా ఇచ్చారన్నారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను

..:: మిగతా 2లో

లొంగిపోతాం, సహకరించండి

జనవరి 1న ఆయుధాలను వీడుతాం.. జనజీవన స్రవంతిలో కలిసిపోతాం

- ప్రభుత్వాలు సంయమనం పాటించాలి
- ప్రక్రియ సజావుగా సాగేలా చూసుకోవాలి
- మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్ సీఎంలకు వినతి
- ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో మావోయిస్టుల లేఖ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో



హైదరాబాద్, నవంబరు 28: మావోయిస్టులు ఊహించని విధంగా ఓ కీలక ప్రకటన చేశారు. వారిక అడవిబాట వీడి జనజీవన స్రవంతిలోకి రాబోతున్నారు. ఇప్పటివరకు తాము కొనసాగించిన పంథాను వీడి ప్రభుత్వానికి లొంగిపోయేందుకు డేట్ ఫిక్స్ చేశారు. ఈ మేరకు ఎంఎంసీ (మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో హిందీలో ఓ లేఖను

..:: మిగతా 2లో



బ్రతికే ఉన్నాడనే ఆధారాలు చూపండి

పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలులో చనిపోయినట్లు పుకార్లు వ్యాపిస్తున్న నేపథ్యంలో ఆయన కుమారుడు ఖాసిమ్ ఖాన్ స్పందించారు. తన తండ్రి బ్రతికే ఉన్నాడన్న ఆధారాలు చూపాలడిమాండ్ చేశారు.

11



జోరుగా నామినేషన్లు

- రాష్ట్రంలో సజావుగా సాగుతున్న ప్రక్రియ
- బ్యాంకులు, పోస్టాఫీసులకు అభ్యర్థుల పరుగులు
- ఎన్నికల ఖర్చు కోసం ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంట్
- పంచాయతీలకు పన్ను బకాయిల చెల్లింపులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబరు 28: రాష్ట్రంలో మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేసేందుకు అభ్యర్థులు జోరుగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. పంచాయతీలలో పన్ను బకాయిలను సైతం

..:: మిగతా 2లో

జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ రెడీ

- పంచాయతీ ఎన్నికలే లక్ష్యంగా పర్యటన
- డిసెంబర్ 1న పాలమూరు నుంచి శ్రీకారం
- కొత్తగూడెం, హుస్నాబాద్, దేవరకొండలో సభలు
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులలో మరింతగా జోష్
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో



హైదరాబాద్, నవంబరు 28 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. గతంలోనే జిల్లాలలో పర్యటిస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి అందుకు అనుగుణంగానే, పంచాయతీ ఎన్నికలలో పార్టీ శ్రేణుల గెలుపే లక్ష్యంగా తన పర్యటన కొనసాగించనున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ ఎన్నికను సీఎం రేవంత్ రెడ్డి సవాల్ గా తీసుకుంటున్నారు. తాను సీఎం అయిన తర్వాత రెండు శాసన సభలకు ఉప ఎన్నికలు జరగగా వాటిని పక్కా వ్యూహంతో

..:: మిగతా 2లో



పోరాటం నుంచి పునర్నిర్మాణం వరకు

- తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్ చరిత్రాత్మక యాత్ర

తెలంగాణ ఉద్యమం చరిత్ర అనేది కేవలం రాజకీయ పరిణామాల సమాహారం కాదు. అది ఒక ప్రాంతపు మనుగడ, గౌరవం, స్వాభిమానాన్ని తిరిగి సాధించుకునే మహత్తర ప్రజా యాత్ర. ఈ దీర్ఘ పోరాటానికి దిశా నిర్దేశం చేసి, ప్రజా భావోద్వేగాన్ని రాజకీయ దిశగా మలచిన నాయకుడిగా నిలిచింది కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వం. తొలి రోజుల నుంచి ఆయన ప్రయాణం ప్రజల నమ్మకంపై నిలిచినది.

..:: 11లో



డ్రగ్స్ రవాణా నెట్‌వర్క్‌పై చర్యలు

వెనిజులాకు చెందిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

11

రాష్ట్రీయం

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బీజేపీ నేతలే

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : 'పట్ట పగలు బీసీల గొంతు కోసిన బీజేపీ నాయకులు ఇప్పుడు రిజర్వేషన్ గురించి మాట్లాడుతున్నారు. బీసీలకు రిజర్వేషన్ రాకుండా అడ్డకుంది వారే' అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. బీసీ ద్రోహులు , వెన్నుపోటు దారులు బీజేపీ నాయకులేనని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా బీజేపీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించకుండా నోరు మూసుకున్న బీజేపీ నాయకులు ఇప్పుడు రేవంత్ రెడ్డి పైన ఎగిరెగిరి పడుతున్నారన్నారు. 'బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కు కనీసం సిగ్గనిపించడం లేదా! ఆయన కూడా రేవంత్ రెడ్డి మీద మాట్లాడుతున్నరు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు ఇచ్చి, ఢిల్లీలో మాట మార్చింది బీజేపీ కాదా?' అని ప్రశ్నించారు. బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు గా ఉన్న లక్ష్మణ్ బీసీ బిల్లు ఆమోదించాలని మోదీ మీద ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదో చెప్పాలన్నారు. 'గాంధీ కుటుంబం గురించి లక్ష్మణ్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. సోనియా, రాహుల్ త్యాగాల కుటుంబం నుంచి వచ్చారు. ప్రధాని పదవే వాళ్లు త్యాగం చేశారు. అది మరచిపోయి లక్ష్మణ్ మాట్లాడుతున్నారు. ఎప్పటికైనా బీసీలకు రిజర్వేషన్లు సాధించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే' అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

దేవ్‌జీ తో సహా పోలీసుల అదుపులో 50 మంది

- వారందరినీ వెంటనే కోర్టులో హాజరుపరచాలి
- దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రకటన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) ఒక ప్రకటన విడుదల చేసింది. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవ్‌జీ సహా మరో 50 మంది పోలీసుల అదుపులో ఉన్నారని ఆ లేఖలో పేర్కొంది. వారిని కోర్టులో హాజరుపరిచాలని డిమాండ్ చేసింది. డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శి వికల్ప్ పేరిట గురువారం నాడు రిలీజైన ఈ ప్రకటన ఈ నెల 22వ తేదీతో ఉంది. ఇందులో నవంబర్ 18వ తేదీన జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్ గురించి అందులో ప్రస్తావించారు. ఏపీలోని మారేడుమిల్లి అడవుల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో హిడ్మా సహా ఆరుగురు మరణించారని పేర్కొన్నారు. ఈ నెల 19న అదే ప్రాంతంలో సురేశ్, శంకర్ సహా ఏడుగురిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపారని అన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ నెల 30వ తేదీన చత్తీస్‌గఢ్ దండకారణ్య బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.



గాంధీభవన్‌లో మహాత్మా ఫూలే వర్ధంతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28: గాంధీభవన్ లో శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కవైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు, డీసీసీ అధ్యక్షుడు కైలాష్‌నేత,అధికార ప్రతినిధి లింగం యాదవ్ తదితరులు ఈ సందర్భంగా ఆ మహనీయుని చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

ఢిల్లీలో తెలంగాణ ఈగల్ పోలీసుల ఆపరేషన్

- వీసా గడువు తీరిన 50 మంది నైజీరియన్ల అరెస్ట్
- భారీ ఎత్తున మత్తు పదార్థాలు స్వాధీనం



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబరు 28: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ఈగల్ టీమ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్, ఎన్‌సీబీ, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం నాడు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. న్యూఢిల్లీలోని 20 ప్రాంతాలలో వీసాల గడువు తీరిన 50 మందికి పైగా నైజీరియన్లు ఉంటున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం తదితర నగరాలతో డ్రగ్స్ సంబంధాలు ఉన్న కీలక నిందితులను అరెస్ట్ చేసారు. 5,340 ఎక్స్ సిటీ మాత్రలు, 250 గ్రాముల కొకైన్, 109 గ్రాముల హెరాయిన్, 250 గ్రాముల మెథాంఫెటమైన్‌ను సీజ్ చేసారు. 59 మ్యూల్ ఖాతాలతోపాటు 16 డ్రగ్స్ కేంద్రాలను గుర్తించారు. నైజీరియాకు చెందిన 107 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసారు. మల్నాడు రెస్టారెంట్, మహీంద్రా యూనివర్సిటీ కేసులో నైజీరియన్ నిక్‌ను అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా ఈ ముఠాతో దాదాపు రెండు వేలకు పైగా డ్రగ్స్ వినియోగదారులు,పెడ్లర్లు ఉన్నట్లు ఈగల్ టీం గుర్తించింది. కొద్ది రోజులలో నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోల్‌కు ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. విచారణలో వీరు చెప్పే కీలక ఆధారాలతో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశం ఉందని సమాచారం.



కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- వృద్ధ కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలి
- ప్రముఖ సంగీత విద్వాంసుడు గిటార్ రావు

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, నవంబరు 28 : జానపద కళలను భావితరాలకు అందించేందుకు మన ప్రభుత్వం కృషి చేయాలని ప్రముఖ సంగీత విద్వాంసుడు గిటార్ రావు అన్నారు. కరీంనగర్ కళాభారతిలో శుక్రవారం నాడు తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ రాష్ట్ర సదస్సు జరిగింది. రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపెల్లి సంధ్య గౌడ్ అధ్యక్షత వహించారు. అందెశ్రీ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా వారికి కూడా ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా గిటార్ రావు మాట్లాడుతూ జానపదం జనం తోడు నుంచి వచ్చిందన్నారు. పల్లె సిద్దులతో, బతకమ్మ బోనాలతో, అక్కా చెల్లెళ్లు సంస్కృతిని ప్రతిబింబే విధంగా జాతీయ అంతర్జాతీయ వేదికలలో ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు. తెలంగాణ మట్టిలో ఆ కళ ఉందని పేర్కొన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నేత పురముల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు.

'పంచాయతీ' హోరు

మొదటిపేజీ తరువాయి

జరగనున్నప్పటికీ, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికలలో తాము బలపర్చే అభ్యర్థుల ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. వారి గెలుపుకు తగిన వ్యూహాలు రచిస్తున్నాయి.

రెండేండ్ల తర్వాత కూడా విశ్వాసం

సాధారణ ఎన్నికలలో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ నేతలు తమ పాలన పట్ల రెండేండ్ల తర్వాత కూడా ప్రజలలో పూర్తి విశ్వాసం ఉందని రుజువు చేసుకోవడమే లక్ష్యంగా పంచాయతీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. సాధారణ ఎన్నికలలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను గ్రామస్థాయిలో ప్రచారం చేసేందుకు వర్గాలు సిద్ధమవుతున్నారు. తమ పథకాల లబ్ధిదారులను తమ ఓటు బ్యాంకుగా మలుచుకోవాలనే ప్రధాన వ్యూహంతో కాంగ్రెస్ ఉంది. గ్రాస్ రూట్ లెవల్లో పార్టీ పటిష్టం కావాలంటే ఈ ఎన్నికలో తమ పట్టును నిరూపించుకోవడమే ప్రధాన లక్ష్యంగా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను స్థానిక నేతలను ఏకతాటిపైకి తీసుకురావడం, నాయకుల మధ్య విభేదాలు ఉంటే పరిష్కరించడం, గ్రామాలను ప్రభావితం చేసే నేతలను తమ గుప్పిట పెట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించారు.

రెండు ఉప ఎన్నికలలో ఓడినా

అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికలలోనూ, రెండు ఉప ఎన్నికలలోనూ చతికిలపడింది. రెండేండ్ల తర్వాత బీఆర్ఎస్‌కు పట్టున్న గ్రామీణ ప్రాంతాలలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే, తమ బలం తగ్గిపోలేదని, ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని ఈ పంచాయతీ ఎన్నికలలో నిరూపించాలని పట్టుదలతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ఉద్యమకాలంలో తమను ఆదరించిన గ్రామాలలో తిరిగి నాటి ఉద్యమ స్ఫూర్తి నింపి గెలుపుబాట పట్టాలనేది గులాబీ పార్టీ నేతల వ్యూహం. తమ ప్రభుత్వ హయాంలో రైతులకిచ్చిన 'రైతు బంధు' వంటి పథకాలు, ఇంటింటికి నీటిని అందించిన 'మిషన్ భగీరథ' వంటి పథకాలు, పెళ్లికి లక్ష రూపాయలు అందించిన 'కల్యాణ లక్ష్మి' పథకాల విజయాలు ప్రజల ముందు ఉంచి విజయం సాధించాలని బీఆర్ఎస్ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. వీటితో పాటు, కాంగ్రెస్ రెండేండ్ల పాలనలోని వైఫల్యాల చిట్టాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్న ఆలోచనలో గులాబీ నేతలు ఉన్నారు.

స్పీడ్ మరింత పెంచాలన్న ఆలోచన

సాధారణ ఎన్నికలలో, ఎంపీ ఎన్నికలలో ఓ మోస్తరు విజయం సాధించిన బీజేపీ ఇక తన స్పీడ్ మరింత పెంచాలన్న ఆలోచనలో ఉంది. అందుకు పంచాయతీ ఎన్నికలను వేదికగా ఉపయోగించుకోవాలని కమలం పార్టీ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. గ్రామాలలో తమ బలం పెంచుకోవడానికి ఈ ఎన్నికలు దోహదపడతాయని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే వ్యూహంతో కమలం నేతలు ఉన్నారు. 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి', 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన', రేషన్ బియ్యం పంపిణీ వంటి అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేసే ఆలోచనలో ఉన్నారు. గ్రామ, మండల స్థాయిలో కార్యకర్తలను క్రియాశీలకంగా పని చేయించడం, రాష్ట్ర నేతలకు మండల, గ్రామ స్థాయి నాయకులను సమన్వయం చేసి ఈ ఎన్నికలలో అద్భుత ఫలితాలు సాధించాలనే యోచనలో బీజేపీ అగ్ర నాయకత్వం ఉంది. గ్రామీణ ఓటరు ఆలోచన ఎలా ఉన్నా, స్థానిక సమస్యలే అధిక స్థాయిలో ఈ పంచాయతీ ఎన్నికలను ప్రభావం చేయనున్నప్పటికీ, అందుకనుగుణంగా వ్యూహాలు రచించే యోచనలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఉన్నాయి

'పంచాయతీ'కి హైకోర్టు సై

మొదటిపేజీ తరువాయి

నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. నామినేషన్ల ప్రక్రియ సైతం ప్రారంభమైంది. డిసెంబర్ 11, 14, 17 తేదీలలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

12,733 గ్రామాలకు ఎన్నికలు

తెలంగాణలో 545 మండలాలు, 12,733 గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యులను ఎన్నుకుంటారు. తొలి విడతకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి దశ పోలింగ్ డిసెంబర్ 11న జరిగి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ మొదలై ఫలితాలు ప్రకటిస్తారు. రెండో, మూడో దశలు డిసెంబర్ 14,17 తేదీలలో జరగనున్నాయి. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. మొదటి దశలో 200 మండలాలు, రెండో దశలో 200 మండలాలు, మూడో దశలో మిగిలిన 145 మండలాలలో పోలింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీఓ 46 జారీ చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు నిర్ణయించింది. ఈ కేటాయింపులు కులాలు, జనాభా ఆధారంగా జరిగాయి, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు లాటరీ విధానంతో ఖరారు చేశారు. దీని మీదనే పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ, ధర్మాసనం స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.



జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డీ

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ఖాతాలో వేశారు. అదే విధంగా పంచాయితీ ఎన్నికలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు గెలిస్తే వచ్చే శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు గెలుపునకు ఎంతో దోహదపడతారని నమ్మిన సీఎం పంచాయితీ పోరుకు సన్నద్ధం అవుతున్నారు. డిసెంబర్ ఒకటి నుంచి జిల్లాల్లో సీఎం పర్యటన ఖరారయ్యింది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. ఆరు రోజుల పాటు సీఎం జిల్లాల టూర్ కొనసాగనుంది. డిసెంబర్ ఒకటిన మహబూబ్ నగర్ జిల్లా మక్తల్, రెండున ఖమ్మం జిల్లా కొత్తగూడెం, మూడున హుస్నాబాద్, నాలుగున ఆదిలాబాద్, ఐదున నర్సంపేట, ఆరున నల్గొండ జిల్లా దేవరకొండలో పార్టీ ఏర్పాటు చేసే సభలలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. సీఎం రేవంత్ జిల్లాల పర్యటన ప్రకటనతో కాంగ్రెస్ శ్రేణులలో మరింత జోష్‌నెలకొంది.

లొంగిపోతాం, సహకరించండి

మొదటిపేజీ తరువాయి

విడుదల చేశారు. జనవరి ఒకటిన ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు కాకుండా అందరం ఒకేసారి గంప గుత్తగా లొంగిపోతామని వివరించారు. అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగుబాటు, గెరిల్లా వ్యూహకర్త హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ మరింత బలహీనమైందని ఆ లేఖలో పేర్కొన్నారు. మిగతావారు కూడా లొంగిపోవాలన్న కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు సంయమనం పాటించి, భద్రతా కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయాలని కోరారు. జోన్‌లో ఎటువంటి అరెస్టులు కానీ, ఎన్‌కౌంటర్‌లు కానీ, అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

పునరావాసాన్ని అంగీకరిస్తాం

2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామని మావోయిస్టులు లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ఆయుధాలను అప్పగించి ప్రభుత్వం కల్పించే పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే ఏదైనా రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు. అందరూ లొంగిపోయే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు. ఈ ప్రక్రియ శాంతియుతంగా పూర్తయ్యేందుకు సానుకూల వాతావరణాన్ని కల్పించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, హోమ్ మంత్రి విష్ణుదేవ్ సాయి, విజయ్ శర్మ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లకు విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవ్‌జీ సహా మరో 50 మంది పోలీసుల అదుపులో ఉన్నారని వారిని వెంటనే కోర్టులో హాజరుపరచాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ డిమాండ్ చేసింది. డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శి వికల్ప్ పేరిట వెలువడిన ఈ ప్రకటనలో హిడ్మా ఎన్‌కౌంటర్ అంశాల గురించి ప్రస్తావించారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఈ నెల 30న ఛత్తీస్‌గఢ్ దండకారణ్య బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సెప్టెంబరు 21న కోసాదాదా, రాజుదాదాలనూ బూటకపు ఎన్‌కౌంటర్‌లో హతమార్చినట్లు వారు ఆరోపించారు. గిరిజన ప్రజల రాజ్యాంగ హక్కులను విస్మరిస్తూ దండకారణ్యం మొత్తం ప్రస్తుతం సైనిక కంటోన్మెంట్ గా రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. కార్పొరేట్ గనుల కోసం లక్షల చెట్లను ఇష్టారీతిన నరికివేస్తున్నారని, అభయారణ్యాల పేరుతో స్థానిక ప్రజలను నిర్వాసితులను చేయడానికి తాఖీదులు జారీ చేస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ కొత్త డ్రామా ఆడుతోంది

మొదటిపేజీ తరువాయి


గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీశ్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని నిలదీశారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. దీక్షా దివాస్ పేరుతో మళ్లీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. బీఆర్ఎస్ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని, అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు.

బీసీ రిజర్వేషన్ గురించి

బీసీ రిజర్వేషన్ పెంపుపై కోర్టుకు వెళ్తామని పీసీసీ చీఫ్ చెప్పారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదన్నారు. రిజర్వేషన్ల పెంపును బీజేపీ అడ్డపడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

ఫూలే ఆశయాలను ముందుకు తీసుకువెళ్దాం

- బీసీ గురకుల సొసైటి కార్యదర్శి బడుగు సైదులు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28: మహాత్మా జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతిని తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాల సొసైటీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విద్య ఎంతో అవసరం అని గుర్తించి పాఠశాలను స్థాపించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను ఆచరించాలని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలతోప్రతి ఒక్కరు వారి పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ జాయింట్ సెక్రెటరీ తిరుపతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా నామినేషన్లు

మొదటిపేజీ తరువాయి

చెల్లించి నో డ్యూస్ సర్టిఫికెట్ సహితం పొందుతున్నారు. తొలి విడత 4,236 సర్పంచి, 37,440 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరుగుతాయి. మొదటి దశలో జరుగనున్న పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రెండో రోజు భారీగా నామినేషన్లు దాఖలు చేసారు. తొలి రోజు 5,063 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో సర్పంచి పదవులకు 3,242, వార్డు పదవులకు 1,821 నామినేషన్లు ఉన్నాయి. రెండో రోజు శుక్రవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు అయినట్లు సమాచారం. ఎన్నికల వ్యయ పరిశీలన కోసం అభ్యర్థులకు కొత్త బ్యాంకు అకౌంట్ ఉండాలి. దీనితో అభ్యర్థులంతా బ్యాంకులలో కొత్తగా అకౌంట్ తెరిచేందుకు పరుగులు తీస్తున్నారు. అకౌంట్ తెరవడానికి బ్యాంకు అధికారులు పాన్‌కార్డు అడుగుతున్నారు. చాలా మందికి పాన్ కార్డు లేకపోవడంతో ఖాతాలు తెరవలేకపోయారు. పోస్టాఫీసులోనూ ఖాతాలు తెరిచేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించినా, చాలా గ్రామాల్లో అవి లేవు. మరోవైపు నామినేషన్లకు ఈ నెల 29 వరకే గడువు ఉండడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

కుల ధ్రువీకరణకు వెసులుబాటు

నామినేషన్లకు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉండగా, కొత్తగా వాటిని పొందే అవకాశం లేదని ఎన్నికల సంఘం గుర్తించింది. దీంతో అభ్యర్థులు తమ కులంపై స్వీయ ధ్రువీకరణ సమర్పించేందుకు అనుమతించింది. పౌరులు తమ ఓటర్ స్లిప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి టీపోల్ అనే మొబైల్ అప్లికేషన్‌రూపొందించింది. దానిని ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంచింది. ఎన్నికలపై న్యాయస్థానాలలో పిటిషన్లు దాఖలవుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టరేట్ లో న్యాయ విభాగం ఏర్పాటైంది. ఇందులో ముగ్గురు సూపరింటెండెంట్ స్థాయి అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, డీపీఓలు తమ అధికార పరిధిలోని ఎన్నికల కేసులకు సంబంధించిన వివరాలను, సూచనలను 24 గంటలలోపు అదనపు అడ్వొకేట్ జనరల్ కు, ప్రభుత్వ న్యాయవాదికి నివేదించాలి. ఈ కేసులను పర్యవేక్షించడానికి జిల్లాల్లో ప్రత్యేక అధికారిని నియమించాలి' అని కలెక్టర్లకు ఆమె తెలిపారు.

“



అమరావతిలో రైల్వేస్టేషన్, రైల్వే లైన్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసమే మరో 16వేల ఎకరాలను సమీకరిస్తున్నాం. ఎయిర్‌పోర్ట్ లేనిదే రాజధాని అభివృద్ధి చెందదు. అందుకే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కట్టాలని సీఎం నిర్ణయించారు. గతంలో స్పోర్ట్స్ సిటీకి 70 ఎకరాలు మాత్రమే కేటాయించగా ఇప్పుడు 2,500 ఎకరాలు ఇచ్చాం.

- ఏపీ మంత్రి నారాయణ





'కాళేశ్వరం'తో కామారెడ్డికి ఒనగూరిందేమిటి ?

- బీసీ రిజర్వేషన్ లేకుండానే ఎన్నికలా?
- కామారెడ్డి పర్యటనలో జాగృతి అధినేత కవిత
- రైలు పట్టాలపై బైఠాయించి నిరసన: అరెస్టు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 28 : కాళేశ్వరం ప్రాజెక్టుతో కామారెడ్డి ప్రాంతంలోని ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదని, దీంతో ఒనగూరిన ప్రయోజనం లేదని, ఈ విషయం చెబితే బీఆర్ఎస్ వాళ్లు నా మీద నోరు వేసుకొని పడిపోతారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు తో ఇక్కడి ప్రాంతానికి ఉపయోగం లేకపోవడంతో ఈ ప్రాజెక్టు పనులను కొనసాగిస్తారా? ప్రత్యామ్నాయంగా కామారెడ్డికి నీళ్లు తెస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్యాకేజీ 21, 22 ద్వారా కాంట్రాక్టర్లకే డబ్బులు వచ్చాయి తప్పితే ప్రజలకు మేలు మాత్రం శూన్యమేనన్నారు. తనను కుట్ర చేసి కుటుంబం నుంచి దూరం చేశారని పేర్కొన్నారు. తమది ఉద్యమం, రాజకీయం అనే కమిట్మెంట్ ఉన్న కుటుంబం అన్నారు. ప్రజలను, కుటుంబాన్ని వేర్వేరు చూసే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ కోసం పనిచేస్తూనే ఉంటానన్నారు. బీసీ రిజర్వేషన్ సాధనలో తెలంగాణ జాగృతి ముందుంటుందన్నారు. రాష్ట్రంలో ఇంత అర్జెంటుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాతే ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఆమె కామారెడ్డి లో రైలు రోకో నిర్వహించారు. రైలు పట్టాలపై బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో కామారెడ్డి పోలీసులు, ఆర్పీఎఫ్ రంగంలోకి దిగారు. కవితతో పాటు పలువురు జాగృతి నేతలను అరెస్టు చేశారు.



విత్తన ముసాయిదా బిల్లుతో చేటు

- రాష్ట్రాల అధికారాలను హరించేలా ఉంది
- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని మండిపడ్డారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు2025 రాష్ట్ర స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లు అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. జిల్లాలవారీగా రైతు సమావేశాలు నిర్వహించి అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.



బహుజనుల విద్యకు బాటలు వేసిన పూలే

- పాస్ రాష్ట్ర అధ్యక్షులు డా. సంగని మల్లేశ్వర్

ప్రతిపక్షం వరంగల్ బ్యూరో, నవంబరు 28 : బహుజనులకు విద్య అందించి వారి జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు జ్యోతిబా పూలే అని పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగం మల్లేశ్వర్ గుర్తు చేసుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, దూరవిద్య కేంద్రంలోని పూలే ప్రాంగణంలో శుక్రవారం నాడు మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లేశ్వర్ మాట్లాడుతూ అణచివేతకు గురైన బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు అన్నారు. బడుగుల సాధికారత కల్పించడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాస్ అధ్యక్షులు తాడూరి శాస్త్రి, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, పాస్ నాయకులు డాక్టర్ కే బిక్షాలు, శ్రీరామ్ వీరయ్య, డాక్టర్ ఎన్ వీణ, కందుల తరుణ్, తుర్పాటి వేంకటేష్, మాలోత్ సురేందర్, పి.వైష్ణవి, యశస్విని, డాక్టర్ ఎస్ జ్యోత్న తదితరులు పాల్గొన్నారు.



మెట్రో స్టేషన్లలో లాకర్ సౌకర్యం

- ఉప్పల్ లో ప్రారంభించిన నిర్వాహకులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : ఎల్ అండ్ టీఎంఆర్ హెచ్ఎల్, టక్కీట్ సంయుక్తంగా హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో స్మార్ట్ లాకర్ సొల్యూషన్లను శుక్రవారం ప్రారంభించాయి. ఏడు మెట్రో స్టేషన్లలో లాకర్ల సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఈ సౌకర్యాన్ని పరిచయం చేస్తూ ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. అనంతరం ఎల్ అండ్ టీఎంఆర్ హెచ్ఎల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ టక్కీట్ తో తమ భాగస్వామ్యం, స్టేషన్లలోకి స్మార్ట్, సురక్షితమైన, అనుకూలమైన స్టోరేజ్ కు అవకాశం ఉంటుందన్నారు. మియాపూర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఎల్ బి నగర్, ఉప్పల్, పరేడ్ గ్రౌండ్, హైటెక్ సిటీ. మరిన్ని వివరాల కోసం, దయచేసి వారి వెబ్‌సైట్ ను సందర్శించండి.



తెలంగాణ శాసనసభలో అర్థవంత చర్చలు

- జర్మనీ ప్రతినిధులతో స్పీకర్ ప్రసాద్ కుమార్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : జర్మనీ దేశ అధికార సోషల్ డెమొక్రటిక్ పార్టీ ప్రతినిధుల బృందం శుక్రవారం నాడు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను స్పీకర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఎస్డీపీ సెక్రెటరీ జనరల్ సబీనా ఫెండరీచ్, ఆసియా పసిఫిక్ హెడ్ మైక్రో గుంథర్, ఇండియా డైరెక్టర్ క్రిస్టోఫ్ పి మోర్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, లేజిస్లేటివ్ సెక్రెటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం 2014 లో నూతనంగా ఏర్పడిందని, రాష్ట్రంలో శాసనసభ, శాసనమండలి ఉన్నాయి. శాసనసభలో 119 మంది, శాసనమండలి లో 40 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. శాసనసభ్యులను ఎన్నికల ద్వారా ప్రజలు నేరుగా ఎన్నుకుంటారని, శాసనసభలో చర్చలు అర్థవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందున్నదని పేర్కొన్నిరు. పెట్టుబడులకు మంచి అవకాశం ఉండడంతో విదేశీ పెట్టుబడులను రాష్ట్రం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు.



కొత్త అక్రెడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి

- ఇండ్ల స్థలాల విషయంలో ప్రత్యేక పాలసీ తేవాలి
- అన్ని అమలయ్యేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి
- హెచ్‌యూజే (టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గం డిమాండ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : రాష్ట్రంలోని జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే - టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అక్రెడిటేషన్ కార్డుల గడువు ముగిసి 18నెలలు కావస్తున్నా ఇప్పటికీ పొడిగింపుతో సమాచార శాఖ కాలం గడుపుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచినా ఇప్పటికీ అక్రెడిటేషన్ పాలసీని ప్రకటించకపోవడం విచారకరని పేర్కొంది. త్యాగరాయ గానసభలో హెచ్ యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్ అధ్యక్షతన ఆ సంఘం కార్యవర్గ సమావేశం శుక్రవారం నాడు జరిగింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలపై నాయకులు కూలంకుషంగా చర్చించారు. ఇండ్ల జాగాల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉన్నప్పటికీ సుప్రీంకోర్టు తీర్పుతో సమస్య జటిలమైందనీ, ఈ నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు లేకుండా చేసేలా ప్రత్యేక పాలసీ తీసుకురావాలని కోరారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులలో ఉచితంగా వైద్యచికిత్సలు అందేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. టీడబ్ల్యూజేఎఫ్ సీనియర్ ఉపాధ్యక్షులు, అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్, ఉపాధ్యక్షులు గుడిగ రఘు, హెచ్‌యూజే కార్యదర్శి జగదీశ్వర్, అధ్యక్షుడు బి అరుణ్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి. రాజశేఖర్ ఇతర అంశాలను వివరించారు.



పూలే కు నివాళులు అర్పించిన చిన్నారెడ్డి

- సీఎం ప్రజావాణికి 276 దరఖాస్తులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : మహాత్మా జ్యోతిబా పూలే 135 వ వర్ధంతి సందర్భంగా సీఎం ప్రజావాణి ఇన్చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, సిబ్బంది శుక్రవారం నాడు నివాళులు అర్పించారు. ప్రజాభవన్ లో పూలే చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి 276 దరఖాస్తులు అందాయి. డా. జి. చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి, పలు సమస్యలను పరిష్కరించారు.

హైదరాబాద్‌లో ఎకరం ధర రూ.151 కోట్లు

- కోకాపేట నియోపోలీస్‌లో రికార్డ్ ధర



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : నగరంలో భూముల విలువలు రికార్డు సృష్టిస్తున్నాయి. కోకాపేట్ పరిసర ప్రాంతాలలో కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈ వేలంలో కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. రెండో విడత వేలంలో ఎకరాకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా, 151 కోట్ల రూపాయలు పలికి కోట్లు కురిపించాయి. ప్లాట్ నెంబర్ 15లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికింది. ప్లాట్ నెంబర్ 16లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది. రెండో విడత వేలంలో భాగంగా 9.06 ఎకరాల భూమిని వేలం వేసిన హెచ్ఎండీఏ 1,3 కోట్ల 52 లక్షల ఆదాయాన్ని పొందింది. ప్లాట్ నెంబర్ 15 లో 4.03 ఎకరాలకు గాను 609 కోట్ల 55 లక్షలు పొందినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ప్లాట్ నెంబర్ 16 లో 5.03 ఎకరాలకు గాను 743 కోట్లు పొందినట్లు పేర్కొన్నారు. 2025, నవంబర్ 25న జరిగిన మొదటి విడత వేలంలో రికార్డు స్థాయిలో ఎకరానికి 137.25 కోట్లు పలికిన సంగతి తెలిసిందే. కోకాపేట నియోపోలిస్ లో 29 ఎకరాలతో పాటు మూసాపేట దగ్గర ఉన్న 16 ఎకరాల భూములకు వేలం వేసేందుకు సిద్ధమైంది హెచ్ఎండీఏ. డిసెంబర్ 3, 5 తేదీలలో మిగతా ప్లాట్లకు ఈ వేలం జరగనుంది. కోకాపేట్ నియోపోలీస్ ప్లాట్లకు ఎకరానికి 99 కోట్లు, కోకాపేట గోల్డెన్ మైల్ ప్లాట్లకు 70 కోట్లు, మూసాపేట్ ప్లాట్ల కు 75 కోట్ల చొప్పున ప్రారంభ ధరను నిర్ణయించింది.

సర్పంచ్‌పదవి చాలా కాస్ట్లీ గురూ!

- గిరిజన పంచాయితీ జోగుగూడెంలో వేలం
- 20 లక్షలకు బహిరంగ పాట పాడిన ఓ నేత
- గద్వాల మండలంలోనూ జోరుగా వేలం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబరు 28 : పంచాయతీ ఎన్నికలు రావడంతో ఏకగ్రీవాలు, బహిరంగ వేలం పాటలు జోరుగా సాగుతున్నాయి. సర్పంచ్ పదవి దక్కించుకోవాలని నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాభివృద్ధి, గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి వేలం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. అలా, ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగుగూడెం పంచాయతీ సర్పంచి పదవికి గ్రామస్థులు శుక్రవారం బహిరంగ వేలం వేశారు. ఏడుగురు అభ్యర్థులు పోటీపడగా, వారిలో అత్యధికంగా ఒకరు రూ.20 లక్షలకు పాడారు. గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి వేలంలో వచ్చిన రూ.20 లక్షల నగదును ఖర్చు చేయనున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. పూర్తిగా గిరిజన (ఎస్టీ) గ్రామమైన జోగుగూడెంలో 1,350 జనాభా ఉండగా 800 మంది వరకు ఓటర్లు ఉన్నారు. రెండో దశలో అంటే డిసెంబర్ 14వ తేదీన ఈ గ్రామంలో పోలింగ్ జగరనుంది. ఈ నెల 30 నుంచి నామినేషన్ల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. వేలం పాట ప్రక్రియ అనంతరం గ్రామస్థులు ఉత్సాహంతో సంబరాలు చేసుకున్నారు. గద్వాల నియోజకవర్గంలో సర్పంచ్ పదవులకు వేలం పాటలు



జోగులాంబ గద్వాలలో

గద్వాల నియోజకవర్గంలో గురువారం మూడు పంచాయతీలకు వేలంపాట నిర్వహించి సర్పంచ్‌లను ఎన్నుకోగా శుక్రవారం కూడా మరికొన్ని పదవులకు వేలంపాటలు కొనసాగాయి. గట్టు మండలం తారాపురం పంచాయతీ సర్పంచ్‌గా తిమ్మప్ప రూ. 16.20 లక్షలకు, ముచ్చోనిపల్లి పంచాయతీ రూ. 14.90 లక్షలకు కురువ శేఖర్, మిట్టదొడ్డి పంచాయతీ సర్పంచ్ పదవిని రూ. 90 లక్షలకు కుమ్మరి శేఖర్ దక్కించుకున్నట్లు సమాచారం. ఈడుగోనిపల్లి గ్రామ సర్పంచ్ పదవికి రూ. 9.80 వేలు, కురువపల్లె సర్పంచ్ పదవికి రూ. 45 లక్షలు, పుటాన్పల్లి సర్పంచ్ పదవికి రూ.15 లక్షలు, వీరాపురం సర్పంచ్ పదవికి రూ. 50 లక్షలు చెల్లించి సర్పంచ్ పదవులు కైవసం చేసుకున్నారు. కేటీ దొడ్డి మండలం ఉమ్మిత్యాల తండా సర్పంచ్ పదవికి రూ.12 లక్షలు, రెండో విడత ఎన్నికలు జరిగే మల్దకల్ మండలం సద్దనోనిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవానికి రూ. 45 లక్షలు వేలం పాట పాడి పదవులు దక్కించుకున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరుగవలసిన ఎన్నికలు అపహాస్యం చేస్తూ వేలం పాటల ద్వారా పదవులు దక్కించుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి .



సర్పంచ్ సహా వార్డులన్నీ ఏకగ్రీవం

- చింతగూడ గ్రామపెద్దల సమష్టి నిర్ణయం
- సర్పంచుగా మాడేమోని ఆగమయ్యకు చాన్స్

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 28 : పంచాయతీ ఎన్నికల నామినేషన్ రెండో రోజు కీలక పరిణామం చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం చింతగూడ సర్పంచును గ్రామ పెద్దలు నిర్ణయించి ఎన్నుకున్నారు. గ్రామంలో సుమారుగా 908 మంది జనాభా,10 వార్డులు ఉన్నాయి. అయితే, ఈ గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తానని, తనకు ఇక అవకాశం ఇవ్వాలని మాడేమోని ఆగమయ్య ముందుకు వచ్చారు. దీంతో పార్టీలకతీతంగా మాడేమోని ఆగమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామపెద్దగా అందరి సమస్యలు తెలిసిన వ్యక్తిగా ఉన్నందున ఆయనను సర్పంచ్ గా ఎన్నుకుంటున్నట్లు గ్రామ పెద్దలు, ప్రజలు పేర్కొన్నారు. సర్పంచ్ గా ఎన్నిక కాబోతున్న మాడేమోని ఆగమయ్యను పంచాయతీ ప్రజలు అభినందనలు తెలిపారు. ఉప సర్పంచ్ గా వంగూరి శంకరయ్య, 10 వార్డులకు కూడా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఒకటో వార్డ్ మెంబర్ గా అనంతమ్మ, రెండో వార్డ్ మెంబర్లుగా స్వర్ణలత, మూడో వార్డ్ మెంబర్ గా శ్రీశైలం, నాలుగో వార్డ్ మెంబర్ గా పద్మమ్మ, ఐదో వార్డ్ మెంబర్ గా నరేష్, ఆరో వార్డు మెంబర్ గా యాదగిరి, ఏడో వార్డు మెంబర్ గా ప్రభాకర్ రెడ్డి, ఎనిమిదో వార్డ్ మెంబర్ గా శంకరయ్య, తొమ్మిదో వార్డ్ మెంబర్ గా మమత, పదో వార్డ్ మెంబర్ గా సత్యంను ఎన్నుకున్నారు.



సౌత్ఆఫ్రికాతో స్వదేశంలో టెస్ట్ సిరీస్‌లో ఓటమికి హెడ్ కోచ్ గంభీర్ తప్పుడు వ్యూహాలు, జట్టులో అతి మార్పులే కారణం. ఈ పరాజయానికి కారణమయిన ఆయనను వెంటనే తొలగించాలి. ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ విజయాలకు రోహిత్ శర్మ, ద్రవిడ్, కోహ్లీ నిర్మించిన జట్టే కారణం. గౌతం గంభీర్ ప్రభావం లేదు.

- మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ


ఓపెన్ వాయిస్

అమెరికా ఎన్నారైలకు మరో ప్రమాదం

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్కడ భారతీయులకు రక్షణ కరువవుతోంది. ఇప్పటికే అక్రమ వలసల పేరుతో వేల మందిని ఇంటికి పంపించారు. గ్రీన్‌కార్డులు నిలిపివేశారు. ఉద్యోగ నియామకాలలో భారతీయులకు ప్రాధాన్యం ఇవ్వొద్దని కంపెనీలకు హుకూం జారీ చేశారు. ఇక అమెరికన్లు భారత షాపులపై దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో మరో కొత్తరకం మోసం వెలుగు చూసింది. భారతీయ విద్యార్థులే లక్ష్యంగా హనీట్రాప్‌కు పాల్పడుతూ దోపిడీ చేస్తున్నారు. మాస్టర్స్ చదువుతున్న విదేశీ కొందరు విద్యార్థులు సంపన్నులైన ఎన్నారైలను ప్రేమ, రిలేషన్‌షిప్ పేరుతో మోసం చేస్తున్నారు. తర్వాత వ్యక్తిగత సందేశాల ద్వారా ఒత్తిడి చేసి విలువైన వస్తువులు, డేటాను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. వివిధ దేశాల నుంచి అమెరికాకు వెళ్లి మాస్టర్స్ చేస్తున్న అమ్మాయిలు భారతీయ సంపన్నులను లక్ష్యంగా చేసుకుని ఈ ఇబ్బందులు పెడుతున్నారు. ఎన్నారైలను నమ్మించి హెల్పర్లుగా ఇండ్లలో చేరుతున్నారు. తర్వాత నమ్మకంగా ఉంటూ ఇండ్లలోని డబ్బులు, జ్యువెల్లరీ, పర్సనల్ ఇన్‌ఫర్మేషన్, విలువైన వస్తువులు దొంగతనం చేస్తున్నారు. ఎన్నారైలు ఎక్కువగా ఒంటరిగా ఉండడంతో చాలా మంది సహాయకుల కోసం చూస్తుంటారు. దీంతో అమ్మాయిలు ఎన్నారైలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. తర్వాత దొంగతనం చేసిన డేటా ఆధారంగా ఎన్నారైలను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు లాక్కుంటున్నారు. ఈ తరహా ట్రాప్ ఎక్కువగా డల్లాస్, ఓహియోలో జరుగుతోందని ఓ యువతి 'ఎక్స్'లో ఓ వీడియో పోస్టు చేసింది. కొందరు అయితే హనీట్రాప్‌తో పాటు పర్సనల్ వీడియోలో, మెస్సేజ్‌లను కూడా మిస్ యూజ్ చేస్తున్నట్లు సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కొందరు డబ్బులు డిమాండ్ చేసి ఇలా వచ్చిన డబ్బులతో ఇండ్లు కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక డల్లాస్, ఓహియో ప్రాంతాలలో ఇలాంటి చీటింగ్‌లకు అరెస్టులు ఉండవు. ఈ నేపథ్యంలో ఎన్నారైలే జాగ్రత్తగా ఉండాలని సూచించింది. అలాగే కొందరు స్టూడెంట్స్ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ మోసాలకు కూడా పాల్పడుతున్నారని తెలిసింది. ప్రేమ, అబ్యూస్, హనీట్రాప్ పేరుతో చీట్ చేస్తున్నారు. వీరి లక్ష్యం ఆర్థికంగా తాము ప్రయోజనం పొందడమే. సాధారణంగా హనీట్రాప్ ను దేశాల రహస్యాలు తెలుసుకోవడానికి వాడుతుంటారు. కానీ, సంపన్న దేశంలో యువతులు ఇలా ఒళ్లు అమ్ముకోవడం, ప్రేమ, అబ్యూస్ పేరుతో మోసాలు చేసి డబ్బులు సంపాదిస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై నెటిజన్లు స్పందిస్తున్నారు. ఇలాంటివి చికాగో, సెయింట్ లూసియాలో కూడా జరుగుతున్నాయని ఓ ఎన్నారై పోస్టు పెట్టాడు. వీటిపై అమెరికా ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలని కొందరు కామెంట్ చేశారు. కొందరు 'బీ కేర్‌ఫుల్' అని సూచిస్తున్నారు. ఒక స్టూడెంట్ ఈ రెండేండ్లలో ఎనిమిది కోట్లు సంపాదించిందని ఓ బాధితుడు తెలిపాడు. కొందరు ఇలాంటివి ప్రపంచమంతా ఉన్నాయని పేర్కొంటున్నారు. హనీ ట్రాప్ అనేది సామాజికంగా మారితే అమెరికా లాంటి దేశాలలో ఇది తీవ్ర ప్రమాదకరంగా పరిగణించవచ్చు. అక్కడి ప్రభుత్వాల సీరియస్ గా చేసుకోనప్పుడు, అక్కడ చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న ఎన్నారైలు జాగ్రత్తగా ఉండి తీరాలి. ఎందుకంటే, బ్లాక్ మెయిల్ చేయాలనుకున్నవారు ఏ రూపంలో చేస్తారో, ఏ రూపంలో దగ్గరవుతారో తెలియని విషయం. కాబట్టి ప్రతి క్షణం, ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాల్సి ఉంటుంది. అదే సమయంలో అమెరికా ప్రభుత్వం కూడా దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. చీటింగ్ చేసినప్పుడు కేసులు పెట్టకపోతే, అది సామాజికంగా మారి, ఆ దేశ ఉనికికే ప్రమాదం జరుగుతుందని అక్కడి పాలకులు తెలుసుకుంటే మంచిది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
29.11.2025

పది విద్యార్థుల అర్ధాకలి చదువులు



డా. చిన్నమైల్ అంజిరెడ్డి
9848010980

రాష్ట్రములో దాదాపు రెండు లక్షల మంది పేద విద్యార్థులు అర్ధాకలితో కాలం గడుపుతున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులు అర్ధాకలితోనే చదువుకోవలసి వస్తున్నది. ఉదయం హడావుడిగా స్పెషల్ క్లాసులకు హాజరవుతుండగా, తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రవుతున్నది. మధ్యాహ్న భోజనం తప్ప ఉదయం బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం స్నాక్స్ తెచుకోవడానికి సమయం లేకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారు. స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థుల కోసం అల్పాహారం (స్నాక్స్) అందించాలి. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి. టెన్త్ క్లాస్ వార్షిక పరీక్షలకు దాదాపు మూడు నెలల టైం మాత్రమే ఉంది. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఇప్పటికే సాయంత్రపు ప్రత్యేక తరగతులు ప్రారంభించాయి. స్పెషల్ తరగతులకు హాజరయ్యే వేలాది విద్యార్థులు ఒక సాధారణమైన కాని అత్యంత ముఖ్యమైన సమస్యతో పోరాడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న వారిలో అధికశాతం గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలు. వారంతా ఉదయం పాఠశాలకు వచ్చి సాయంత్రం వరకు క్లాసులోనే ఉండే ఈ చిన్నారుల శారీరక, మానసిక శక్తిని దెబ్బతీస్తున్నది. ప్రత్యేక తరగతులు ఎంత అవసరమైనవో, ఆ తరగతులకు హాజరయ్యే బలహీన పిల్లలకు ఆహారం కూడా అంతే అవసరం.

నిరుడు స్నాక్స్ తో హాజరు పెరిగింది

నిరుడు ఈ ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందించడం వల్ల మంచి ప్రయోజనం కనిపించింది. హాజరు పెరిగింది, విద్యార్థుల చురుకుదనం పెరిగింది, పరీక్షలలో ఫలితాలూ మెరుగుపడ్డాయి. కానీ, ఈసారి ఈ చిన్న అవసరం తీర్చడానికి కూడా ప్రభుత్వం ముందుకు రావడానికి ఆసక్తి చూపకపోవడం ఇటు ఆందోళన కలిగించే విషయంగా మారింది. రోజుకు ఒక్కో విద్యార్థి కోసం కనీసం రూ.10 కూడా ఖర్చు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సాయంత్రం 6-7 గంటల వరకు బడులలో ఉండాల్సి రావడం చాలా పెద్ద సమస్య. ఆకలితో క్లాసులో కూర్చుని శారీరక వేదనకు గురవుతున్నారు. ఆకలి శాంతించకపోతే పాఠాలు మెదడులోకి ఎలా వెళుతాయి? బలహీనతతో పిల్లలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఎంతైనా ఉంది. ఈ వాస్తవాన్ని ప్రభుత్వం ఎందుకు చూడడం లేదు? పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థుల మీద ఒత్తిడి పెరుగుతుంది. ఈ సమయంలో వారికి కావాల్సింది మానసిక ప్రశాంతత, సరైన ఆహారం, ఆరోగ్యకర వాతావరణం. ప్రభుత్వం లక్షల రూపాయలతో పథకాలు అమలు చేయగలుగుతోంది. కానీ, లక్షలాది పేద విద్యార్థుల కోసం రోజుకు పది రూపాయలు ఖర్చు పెట్టలేకపోవడం ఆశ్చర్యకరం. కనీసం ఇప్పుడైనా విద్యాశాఖ మేల్కొనాలి.



వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలి

వెంటనే ఉత్తర్వులు జారీ చేసి స్నాక్స్ పంపిణీని ప్రారంభించాలి. ఈ నిర్ణయం కేవలం ఓ పరిపాలనా చర్య కాదు. ఇది వేలాది పేద కుటుంబాలకు భరోసా. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు, రాష్ట్రపు విద్యా ప్రమాణాలకు సంబంధించిన విషయం. నిరుడు రాష్టంలో అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసి, సీఎస్ఆర్ ఫండ్ తో విద్యార్థులకు అల్పాహారం అందించారు. ప్రభుత్వం ఎన్ని రకాల విద్యా సంస్కరణలు చేసినా, ఆకలితో ఉన్న విద్యార్థి చదువుపై దృష్టి పెట్టడం లేదు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలంటే ముందుగా విద్యార్థి కడుపు నింపాలి. ఈ విషయం ప్రభుత్వం గమనించి వెంటనే చర్యలు చేపట్టాలి.

(వ్యాస రచయిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, కరీంనగర్)

గాంధీయిజం, మార్క్సిజం అవసరం తీరిందా! పెరిగిందా!!

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. చరిత్ర వారికే లొంగి వుండాలనేదేమీ లేదు. వారు పోయాక వారి చరిత్ర హీరో నుండి విలన్ గా మార్చ బడుతుంది. ఇవన్నీ తెలిసి ఎవరో కొందరు పారిశ్రామిక వేత్తలతు, సంపన్నులకు పని చేసి పెట్టే గుమాస్తాలుగా మారితే వారిని చరిత్ర మెచ్చుతుందా? స్వాతంత్ర ఉద్యమ నాయకుడైన గాంధీనే విలన్ గా మార్చి హంతకుడైన గాడ్సేని హీరోగా చరిత్ర మారుస్తుంటే గాంధీ పథం మనకు పనికి వస్తుందా? మానసిక పరివర్తన , సదాలోచన, మనిషిలోని మంచిని వెలికి తీయకుండా కఠినంగా ప్రవర్తిస్తే ఆసియా విధానాల స్థానంలో యూరపు విధానాలు బలం పుంజుకుంటాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజలపైనే కత్తి దూస్తే బంగ్లాదేశ్ లో వలె తిరగ బడుతారు. కానీ, విశాలమైన దేశం కావడం వల్ల అది సులభం కాదు.



బీఎస్ రాములు
8331966987

చాలా కాలంగా ఒక సందేహం తొలుస్తూ వచ్చింది. అంబేద్కర్ కూ గాంధీకీ మధ్య జరిగిన చర్చలు. గాంధీని ముట్టుకుంటే జడివానలా విమర్శలు మీద పడుతాయని ఉండి పోయాను. అయినా సంభాషణలలో, ప్రసంగాలలో అంబేద్కర్ లాగే గాంధీ ప్రసక్తి అపుడపుడు తెస్తుండేవాడిని. గాంధీ, నెహ్రూ, వల్లభ్ బాయి పటేల్ తదితరులు కలిసి బీసీలను నిండా ముంచారు. మంచి మాటలతో మభ్య పెట్టి బీసీల గొంతు కోసారు. అంబేద్కర్ సాధించిన కమ్యూనల్ అవార్డుకు వ్యతిరేకంగా గాంధీ ఆమరణ దీక్ష చేయడంతో, అవి రద్దయి కొత్త ఒప్పందానికి మలుపు తిరిగాయి. కమ్యూనల్ అవార్డు ద్వారా ఎస్సీలు అదనంగా తమలో తాము ఓటు వేసుకొని తమ కులాల వారిని ప్రతినిధులుగా ఎన్నుకునే ఏర్పాటు. దీన్ని గాంధీ వ్యతిరేకించి ఆమరణ నిరాహార దీక్ష చేసి రద్దు చేయించి 1932లో పూనా ఒప్పందంతో సరి పుచ్చారు. పూనా ఒప్పందం ప్రకారమే ఇపుడు భారత రాజ్యాంగం ద్వారా ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

మంచి మాటలతో మోస పుచ్చి


మంచి మాటలతో మోస పుచ్చి 75 యేండ్లుగా బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్ల ప్రాచునిధ్యం లేకుండా చేశారు. అలాంటి గాంధీని, నెహ్రూను సోషలిస్టులని పని గట్టుకొని కొందరు ప్రచారం చేసారు. గాంధీ అనుచరుడు, ఫ్రెంచి సోషలిజం భావాలను స్వీకరించి రామ్మనోహర్ లోహియా బీసీలకు తమ పార్టీలో 60 శాతం పదవులిచ్చి 1967 నుండి యూపీ. బిహార్ లో అధికారంలో రావడానికి కారకుడయ్యాడు. అయితే, లోహియా గాంధీని , రాముడిని, కృష్ణుడిని ఆదర్శీకరించడం, అంబేద్కర్ కు, పెరియార్ రామస్వామికి దూరంగా వుండడం వల్ల సైద్ధాంతిక స్థాయిలో పూర్తిగా మన వాడు అని బీసీ ఎస్సీ మేధావులు ప్రకటించ లేకపోయారు. పైగా గాంధీ ఎస్సీ రిజర్వేషన్లకు కూడా ఎసరు పెట్టిన వాడాయె. గాంధీ ఆచరణ, ఆలోచన, ఉద్యమ రూపాలు లక్ష్య సాధన మొదలైన అనేక వైరుధ్యాలకు, విమర్శలకు తావిచ్చాయి.


గాంధీ నుండి నేర్చుకోలసింది ఉందా?

ఇన్ని పరిమితులలో గాంధీ నుండి బీసీలుగానీ, ఎస్సీలు, ఎస్టీలు, వామపక్షాలు నేర్చుకోవలసినది, స్వీకరించాల్సినది ఏమైనా ఉందా అని వెతుకులాటకు పరిమితం ఈ వ్యాసం. ముఖ్యంగా గాంధీ చేపట్టిన అహింస, శాంతియుత ఉద్యమాలు, సత్యాగ్రహం, నిరాహార దీక్ష, సహాయ నిరాకరణ, సమ్మె , శాసనోల్లంఘన, విదేశీ వస్తు బహిష్కరణ, మొదలైన ఉద్యమ రూపాల ద్వారా డిమాండ్ల సాధన అనేవి ప్రపంచ వ్యాప్తంగా మేధావులను ఆకర్షించాయి. ఇవి సార్వజనీనంగా ప్రపంచ దేశ ప్రజలకు ఉపయోగ పడుతాయా? మరి, ఉపయోగ పడితే ఎంత మేరకు? అనే చర్చ ఈ వ్యాసం పరిమితి. నల్ల జాతి నాయకుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ గాంధీని స్వీకరించాడు. గాంధీ ఆనాడు తీసుకున్న ఉద్యమ రూపాలు నేడు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు , రైతులు, మహిళలు అనుసరిస్తున్నారు. ప్రభుత్వాలు, పారిశ్రామిక యజమానులు ఆ ఉద్యమ రూపాలతో ఒప్పందాలకు వస్తున్నారు. కనుక వీటిని గాంధీ విధానాలు, గాంధీ మార్గం పేరిట ప్రచారం చేయబడుతున్నాయి. అది సహజం. ఒక ప్రసిద్ధ నాయకుడి పేర చలామణిలో వుంటే వాటి ప్రభావం స్ఫూర్తి ఎన్నో రెట్లు పెరుగుతుంది. ఇందిరా గాంధీ కూడా సోషలిజం గురించి ప్రచారం చేయడమే కాకుండా భారత రాజ్యాంగంలో ఆ పదాలను చేర్చారు. గాంధీ చెప్పిన విధానాల కన్నా భిన్నంగా పోతే లాఠీలు, తూటాలు, వాటర్ క్యాన్లు అరెస్టులు చిత్రహింసలు, చూస్తూనే వున్నాం.

శాంతియుత పోరాటాల ద్వారా

ఆంధ్ర ప్రభ డెయిలీలో 28 నవంబర్ న మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి రోజున గాంధీ గురించిన వ్యాసం వచ్చింది. ఆ వ్యాసంలో నాగసూరి వేణుగోపాల్, త్రిపురనేని గోపీచంద్ 1957లో రాసిన ప్రసంగ వ్యాసాన్ని పరిచయం చేసారు. ఆనాడు జి. సురమౌళి గాంధీజీపై నిర్వహించిన ప్రసంగ పరంపరలో ఇదొకటి అని పేర్కొన్నారు. ఈ వ్యాసంలో గాంధీని మార్క్స్ ను వారి పోరాట పంథాల స్వభావాలను పరిచయం చేసారు. అహింస, శాంతియుత పోరాటాల ద్వారా ఎదుటి వారిలోని మంచితనాన్ని వెలికి తీసే విధానం గాంధీ ఆచరించాడు. లక్ష్యంతో పాటు అందుకు ఉపయోగించే సాధనాలు ముఖ్యం అన్నాడు గాంధీ. గాంధీ ప్రపంచానికి మార్క్స్ కన్నా భిన్నమైన ఆదర్శాలు సాధనాలను అందించాడు అని, అందుకు తాను టాల్ స్టాయి నుండి స్ఫూర్తి పొందానని గాంధీ చెప్పిన మాట గుర్తు చేసాడు. నాకు ఇక్కడే సందేహం కలిగింది. గాంధీ మన దేశంలో శతాబ్దాలు కొనసాగిన బుద్ధుడిని,





బౌద్ధ విధానాలు సాధనాలు స్ఫూర్తి అని చెప్పకుండా టాల్ స్టాయిని ఎందుకు చెప్పాడు అని? గాంధీ ఆనాడు కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ ఉండాలని బలంగా కోరుకున్నాడు. బౌద్ధం, వైదిక పురాణ, వర్ణ, కుల వ్యవస్థలను విరాకరిస్తుంది. సమానత్వాన్ని స్వేచ్ఛను మనుషులందరు సమానం అంటుంది. హిందూ ముస్లిం సఖ్యత కోసం భక్త కబీర్ ఆ కాలంలో చేసిన కృషి గొప్పది. ఆ తరువాత గురునానక్ అదే సమన్వయ దృష్టిని తీసుకున్నాడు. కబీర్ పంథీ, బౌద్ధం శాంతియత పరివర్తననే ప్రతిపాదించాయి. ఆచరించాయి. అందుకే అంబేద్కర్ బౌద్ధం స్వీకరించాడు. కుల వ్యవస్థ రద్దు కోరుతూ సమానత్వం స్వేచ్ఛ కోరడం వల్లనే గాంధీ బౌద్ధాన్ని కాకుండా టాల్ స్టాయిని జాగ్రత్తగా ముందుకు తోసాడా? గాంధీ కూడా అంబేద్కర్ లా అంబేద్కర్ కన్నా ముందు నుండి టాల్ స్టాయికి బదులుగా బుద్ధున్ని స్ఫూర్తి అని చెప్పి వుంటే అంబేద్కర్ గాంధీజీ కలిసి ఆనందుడు, ఉపాలి, అశ్వ ఘోషుడు, ధర్మ కీర్తి వలె కొన్ని శతాబ్దాలు ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచేవారా?

అంబేద్కర్ స్ఫూర్తి ప్రపంచమంతా

అలా చేయక పోవడం వల్ల గాంధీ వెనకకు పోయాడు. అంబేద్కర్ స్ఫూర్తి ప్రపంచమంతా వ్యాపిస్తున్నది. బౌద్ధం నుండి తీసుకుని బౌద్ధం పేరు తలవకపోవడం మొదటి నుండీ వర్ణ కులవాదులు చేస్తున్న పనే గాంధీజీ చేసారు. మహాత్మా జ్యోతి రావు పూలే నుండి మహాత్మా, బిరుదును, మద్య పాన వ్యతిరేక విజన్ ను గాంధీ స్వీకరించాడు. సమయం వచ్చినపుడల్లా గాంధీ ముస్లింల వైపు మొగ్గు చూపాడు తప్ప, శూద్రుల వైపు ఏనాడూ మొగ్గు చూప లేదు. ఆధునిక విద్య ఉద్యోగాలు అందుకొమ్మని చెప్పకుండా గ్రామీణ కుల వృత్తులు కాపాడు కోవాలని చెప్పాడు. చివరి దశలో కుల వ్యవస్థ రద్దు అవసరం అని గాంధీ భావించినా అప్పటికి సమయం మించి పోయింది. హత్యకు గురయ్యాడు. ఇన్ని విభేదాలున్నప్పటికీ గాంధీ మార్గం రాజ్యాంగ బద్దంగా ఆమోదం పొందింది. ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్య వ్యవస్థ పరిధిలో అంతకు మించి మిలిటెంటు ఉద్యమాలు కుదరవు.

యజమానుల మనసు కరగక పోతే

పరిపాలకుల, యజమానుల మనసు కరగక పోతే ఎట్లా? ప్రసిద్ధ రచయిత మున్షీ ప్రేంచంద్ వందేండ్ల క్రితమే ఈ ప్రశ్న లేవ నెత్తాడు. ఇటీవల డిల్లీలో ఉత్తరాది రైతులు యేడాది పాటు శాంతియుతంగా బందు పెట్టు కొని వండుకొని తినుకుంటూ ఆందోళన చేశారు. బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దక్షిణాది రాష్ట్రాలు సంఘీభావం తెలుపలేదు. ఇటు అధికారంలో వున్న పార్టీలు ఇలా ప్రవర్తిస్తే గాంధీ మార్గం నుండి వైదొలగి ఇతర రూపాలతో ముందుకు సాగరా? అపుడది మార్క్సిజం చెప్పిన మార్గాలని విమర్శిస్తారు. అరెస్టు కేసులు, చివరకు ఎన్ కౌంటర్లు అంటారు. రైతాంగ, సామాజిక రాజకీయ, విద్యార్థి, ట్రేడ్ యునియన్ తదితర సమస్త వర్గాల శ్రేణుల ఉద్యమాలను పరిష్కరించక, నిర్బంధాలు ప్రయోగించి శాంతి భద్రతల సమస్యగా మార్చి, చివరకు సమస్యను పక్కకు పెట్టి కేవలం శాంతి భద్రత సమస్య అంటూ ప్రభుత్వాలు యాజమాన్యాలు ప్రవర్తిస్తే గాంధీయిజం బుద్ధిజం స్థానంలో మార్క్సిజం, లెనినిజం, చివరకు మావోయిజం ముందుకు వస్తే అందుకు కారకులెవరు? అధికారంలో వున్నవారు కాదా? బ్రిటిష్ వారు గాంధీని, నెహ్రూను జైలులో పెట్టారు అంటే ఎకరం రెండెకరాలున్న భవంతులలో వంట మనిషిని, అటెండర్ ను ఏర్పాటు చేసి అనేక పుస్తకాలు ఇచ్చి పత్రికలకు వ్యాసం రాసి పత్రికలు నడుపుకునే స్వేచ్ఛ ఇచ్చారు. మరి మన స్వంత పాలకులు ఈ మర్యాదలు పాటిస్తున్నారా?

చరిత్ర హీరో నుండి విలన్ గా మార్చ బడుతుంది

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. చరిత్ర వారికే లొంగి వుండాలనేదేమీ లేదు. వారు పోయాక వారి చరిత్ర హీరో నుండి విలన్ గా మార్చ బడుతుంది. ఇవన్నీ తెలిసి ఎవరో కొందరు పారిశ్రామిక వేత్తలతు, సంపన్నులకు పని చేసి పెట్టే గుమాస్తాలుగా మారితే వారిని చరిత్ర మెచ్చుతుందా? స్వాతంత్ర ఉద్యమ నాయకుడైన గాంధీనే విలన్ గా మార్చి హంతకుడైన గాడ్సేని హీరోగా చరిత్ర మారుస్తుంటే గాంధీ పథం మనకు పనికి వస్తుందా? మానసిక పరివర్తన , సదాలోచన, మనిషిలోని మంచిని వెలికి తీయకుండా కఠినంగా ప్రవర్తిస్తే ఆసియా విధానాల స్థానంలో యూరపు విధానాలు బలం పుంజుకుంటాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజలపైనే కత్తి దూస్తే బంగ్లాదేశ్ లో వలె తిరగ బడుతారు. కానీ, విశాలమైన దేశం కావడం వల్ల అది సులభం కాదు. చట్ట సభలలో రిజర్వేషన్ల ప్రాతినిధ్యం కోసం బీసీలు శాంతియుతంగానైనా సరే, కదలలేక పోతున్నారు. ప్రభుత్వాలను దించే స్థాయి వస్తుందా? ఓటు హక్కు ద్వారానే అది సాధ్యం కావాలి. శాంతియుతమైన పోరాటాలే చేయలేని మెజారిటీ ప్రజలు సాయుధ పోరాటాలు, మార్క్సిజం బాట పట్టడం సాధ్యమా? లోక్ నాయక్ జయ ప్రకాశ్ నారాయణ్ వంటి అందరిని కలుపుకు పోయే జాతీయ నాయకులేరి? తుపాకి పట్టినంత మాత్రాన సాయుధ పోరాటాలు అవుతాయా? పోనీ స్వదేశీ సుభాష్ చంద్ర బోస్ మనకుండగా మావో పేరుతో ఊరేగడం ఏ మాత్రం ఆత్మాభిమానం ఉన్నవాళ్లు చేయదగిన పనేనా? చివరగా సారాంశం ఏమిటి? మార్క్సిజం, గాంధీఇజం బుద్ధిజం వేరు వేరు కావు. ప్రభుత్వాలు అనుసరించే విధానాల వల్ల అవి ముందుకు రావడం వెనక్కి పోవడం జరుగుతుంది. అయిదేండ్లు ఓపిక పట్టి బ్యాలట్ బాక్సుతో వారిని తరిమేయడమే అన్నిటికన్నా సులభమైన మార్గం.

(వ్యాస రచయిత సామాజిక తత్వవేత్త)

హితవు

పాలస్తీనావాసుల వెతలు వినేవారెవరు!

29 నవంబర్ 1947న ఐరాస పాలస్తీనా విభజన తీర్మానం ఆమోదించిన సందర్భానికి గుర్తుగా యేటా 29 నవంబర్‌న ప్రపంచ దేశాలు 'పాలస్తీనా ప్రజల పట్ల అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం' పాటించాలని 1978లో సూచించింది. పాలస్తీనా భూభాగంపై చట్టవిరుద్ధమైన ఆక్రమణలను ముగించాలని కోరడంతో పాటు పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలవాలని కోరింది. కానీ, ఏడు దశాబ్దాలుగా పలు ప్రయత్నాలు జరిగినప్పటికీ, మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతి అస్పష్టంగానే ఉన్నదని, తక్షణ పరిష్కారం జరగాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది. పాలస్తీనీయన్ల హక్కుల కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. ఇజ్రాయిల్ దాడులతో గాజాలో నేడు మానవతా సంక్షోభం ఏర్పడింది. ఇజ్రాయిల్ పాలస్తీనా యుద్ధం తీవ్ర రూపం దాల్చి గాజాను నేల మట్టం చేయడంతో ప్రజలు దీనంగా ప్రాణాలను అరచేతులలో పెట్టుకొని వలస వెళుతున్నారు. ఈ యుద్ధంలో దాదాపు 80 శాతం పాలస్తీనియన్ పౌరులు మరణించి ఉంటారని అంచనా. 25 మాసాలుగాజరుగుతున్న దాడులతో 72,500కు పైగా (70,525 పాలస్తీనా పౌరులు, 2,109 ఇజ్రాయిల్ పౌరులు) ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన అభాగ్యులలో దాదాపు 33 శాతం మంది 18 యేండ్ల లోపు వారే ఉండడం విచారకరం. దీనికి తోడుగా దాదాపు 2.3 మిలియన్ వలసలు కూడా జరిగినట్లు తెలుస్తున్నది. వలసదారుల ఆకలి కేకలు వినే నాథుడే కరువైన దుస్థితి ఏర్పడింది. ఇజ్రాయిలీల బాంబు దాడులకు గాజా గజగజ వణుకుతోంది. శాశ్వత యుద్ధ విరమణ చర్యలు ముందుకు సాగడం లేదు. 2025 తొలి రోజులలో 32 వేల మంది పాలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో నుంచి గెంటేసి తిరిగి రాకుండా అడ్డుకట్ట వేయడం ప్రపంచం చూస్తూ నివ్వెరపోయిందే కానీ, ఏ సంస్థ లేదా దేశం కూడా అడ్డుపడలేదు. పాలస్తీనా నామరూపాలు లేకుండా పోయింది. ఐరాస తన సత్తా చాటాలి. శాశ్వత శాంతి స్థాపనకు ఐరాసతో పాటు అగ్ర రాజ్యాలు కూడా నడుం బిగించాలని కోరుకుందాం.

(నేడు (29 పాలస్తీనా ప్రజల పట్ల అంతర్జాతీయ సంఘీభావ దినోత్సవం)



- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం

హైడ్రా అంటే భరోసా అని చాటి చెప్పారు

- వరదలు ముంచెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు
- ఎంఈటీలను అభినందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 28: 'వర్షం ఎంత పడినా హైడ్రా ఉందనే భరోసా నగర ప్రజలకు ఇచ్చారు. భారీ వర్షాలు పడినా వరదలు ముంచెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నిత్యం క్యాచ్ పిట్లు, కల్వర్టులతో పాటు.. నాలాల్లో పూడిక తీసి వరద సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు' అని మాన్సూన్ ఎమర్జన్సీ, డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. వర్షాకాలంలో పని చేసే మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌ల కాలపరిమితి 150 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జలవిహార్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ 5 నెలల క్రితం ఇక్కడే సమావేశమై.. మాన్సూన్ విధుల గురించి వివరించాం. నిర్దేశించిన దానికంటే ఎక్కువ పని చేసి హైడ్రాతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చారు. వర్షాల వేళ ముప్పు ప్రాంతాల్లో సేవలందిస్తూ ప్రజల ప్రశంసలు అందుకున్నారు. సమస్య పరిష్కారం వరకే పరిమితం అవ్వకుండా.. ఆ సమస్యకు కారణాలను కూడా తెలుసుకుని పని చేసిన తీరు అభినందనీయమని హైడ్రా కమిషనర్ అన్నారు.

కుంభవృష్టి వానలు కురిసినా..

హైడ్రాలో భాగమైన డిజాస్టర్ రెస్పాన్స్ సిబ్బంది, ఎస్ ఎఫ్‌వోలు, మార్షల్స్‌తో కలసి మెట్ టీమ్‌లు ఎంతో నిబద్ధతతో పని చేశాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. ఇలా 3 వేల లారీల పూడికను నాలాల నుంచి తొలగించి వరద సాఫీగా సాగేలా రేయింబవళ్లు పని చేసిన తీరు నగర ప్రజలు గమనించారన్నారు. వర్షాలు వస్తున్న వేళ.. వరద భయం లేకుండా నగర ప్రజలు ప్రయాణాలు సాఫీగా సాగించారు. కాలనీలు నీట మునగకుండా ముందస్తు జాగ్రత్తలో వరద ముప్పు లేకుండా చేశారంటూ హైడ్రా కమిషనర్ మెట్ టీమ్‌లను కొనియాడారు. వాతావరణ పరిస్థితుల వల్ల క్లౌడ్‌బరస్ట్‌లు చాలాసార్లు సంభవించాయి. ఒకే రోజు 10 నుంచి 18 సెంటీమీటర్లు వర్షం పడిన సందర్భాలు అనేకం ఈ వర్షాకాలం చవి చూశాం.. కాని మీరంతా మనసుపెట్టి పని చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో నిరూపించారు. అందుకే ఒక్క అభినందన సమావేశంలా కాకుండా.. వ్యక్తిగతంగా ఉన్నత శిఖరాలకు అన్ని విధాల ఎదిగేలా వ్యక్తిత్వ వికాసానికి కూడా హైడ్రా ప్రయత్నించిందన్నారు. ఈ క్రమంలోనే ఆర్థిక క్రమశిక్షణ, సరైన జీవన విధానాలను అలవర్చుకునే విధంగా వ్యక్తిత్వ వికాస తరగతులు కూడా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ, ఆర్థిక వికాస నిపుణులు వంగా రాజేంద్రప్రసాద్, ఎం. నర్సింగ్, చిల్లంచెట్టి గణేష్‌లను హైడ్రా కమిషనర్ మెమొంటోలు అందజేసి సన్మానించారు.

30 మందికి అవార్డులు

మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్ (ఎంఈటీ)లలో ఉత్తమంగా పని చేసిన 30 మందికి ప్రశంసాపత్రం, బహుమతిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అందజేశారు. అలాగే శాలువతో సన్మానించారు. నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు.. ఊళ్ల నుంచి వచ్చిన వారు ఈ వర్షాకాలం ఎంఈటీలో భాగస్వామ్యమై గొప్ప సేవలందించారని.. నిబద్ధతతో పని చేశారని కమిషనర్ కొనియాడారు. ఈ ఏడాది ఎంతో అనుభవం గడించాం. వచ్చే ఏడాది మరింత సమర్థవంతంగా వర్షాకాలం పని చేసేందుకు ఈ అనుభవం ఎంతో దోహదం చేస్తోంది. భారీ వర్షాలు పడితే ఏ ప్రాంతాలు నీట మునుగుతాయి.. ఇందుకు గల కారణాలు ఏంటి ఇలా అన్నిటిపైనా మెట్ టీమ్‌లతో పాటు.. డీఆర్ ఎఫ్, ఎస్ఎఫ్‌వోలకు స్పష్టమైన అవగాహన మొదటి ఏడాది వచ్చిందన్నారు. ఈ క్రమంలోనే అమీర్‌పేటలో నాలాలను పూడిక తీసి వరద ముప్పు తప్పించాం. అలాగే ప్యాట్నీ నాలా ఆక్రమణలను తొలగించి 25 కాలనీలు, బస్తీలకు వరద ముప్పు లేకుండా చేశామని హైడ్రా కమిషనర్ చెప్పారు. ఇలా ఎన్నో విజయాలు సాధించామన్నారు. ఈ వర్షాకాలంలో హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు, ఎస్ ఎఫ్‌వోలు పని చేసిన తీరును హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య వివరించారు. పొదుపు ఆవశ్యకతతో పాటు.. ఆరోగ్య పరిరక్షణ గురించి హైడ్రా అడ్మిన్ ఎస్పీ ఆర్. సుదర్శన్ పలు సూచనలు చేశారు. ముఖ్యమైన పండగలున్నా సెలవులు పెట్టకుండా.. వర్షాకాలంలో పని చేశారని కొనియాడారు.



ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 28 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లి శివాలయం గుడి వద్ద ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిధిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ కి అయ్యప్ప స్వాములు భగవద్గీత పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిహరసుతుడు అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేమూరి కాసాని వీరేష్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ రాములు గౌడ్, సత్యనారాయణ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, చెన్నారెడ్డి, షాకీర్, అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపటి నుంచి నామినేషన్లు

- 19 గ్రామ పంచాయతీలు 166 వార్డులకు ఎన్నిక



ప్రతిపక్షం , మొయినాబాద్, నవంబర్ 28: గ్రామ పంచాయతీ సర్పంచుల, వార్డు సభ్యు ఎన్నికకు ఈ నెల 30వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల అభివృద్ధి అధికారిణి సంధ్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు మూడు విడుతల వారీగా నిర్వహిస్తున్న సందర్భంగా రెండవ విడుత డిసెంబర్ 14న జరిగే పంచాయితీ ఎన్నికలకు గాను మొయినాబాద్ మండలంలో నవంబర్ 30వ తేది నుండి డిసెంబర్ 2వ తేది వరకు మూడు రోజుల పాటు నామినేషన్లు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలు, 166 వార్డు సభ్యులు ఉండగా ఇందులో 30250 ఓటర్లు, పురుషులు 15270, మహిళలు 14981.ట్రాన్స్ జెండర్ 1 ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలకుగాను 5 క్లస్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో కనకమామిడి, అప్పారెడ్డిగూడ, కేతిరెడ్డిపల్లి గ్రామాలు, రెండవ క్లస్టర్ చిన్నమంగళారం, మేడిపల్లి, కుత్బుద్దీన్ గూడ, ఎల్కగూడ, మూడవ క్లస్టర్ చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, నాల్గవ క్లస్టర్ శ్రీరాంనగర్, తోల్కట్ట, నక్కలపల్లి, వెంకటాపూర్, ఎత్మార్ పల్లి, ఐదవ క్లస్టర్ బాకారం, నాగిరెడ్డి, అమ్డా పూర్, కాళీంబౌలి లో సర్పంచులు, వార్డు సభ్యులు ఉదయం 10:30 గంటల నుండి 5 గంటల వరకు నామినేషన్లు వేయవచ్చునని తెలిపారు. మూడు రోజుల పాటు ఈ నామినేషన్ల పర్వం కొనసాగుతుందని తెలిపారు.



జోరందుకున్న నామినేషన్ల దాఖలు

- 126 నామినేషన్ల స్వీకరణ

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 28: నల్గొండ జిల్లా చిట్యాల మండలంలో సర్పంచు, వార్డు స్థానాలకు నామినేషన్ల దాఖలు జోరందుకుంది. శుక్రవారం మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో గల ఆరు క్లస్టర్ కేంద్రాలలో మొత్తం 77 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో జయలక్ష్మి తెలిపారు. వాటిలో సర్పంచ్ స్థానాలకు 21 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 56 నామినేషన్లు ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. అత్యధికంగా సర్పంచ్ స్థానాలకు వెలిమినేడులో 5, నేరడలో 4, వార్డులకు అత్యధికంగా వెలిమినేడులో 18 చిన్నకాపర్తిలో 9 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం, శుక్రవారం మొత్తం కలిపి 126 నామినేషన్లు అధికారులు స్వీకరించారు.



గంజాయి కేసులో నలుగురికి పదేళ్ల జైలు

- రూ. లక్ష చొప్పున జరిమానా



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 28 : సంగారెడ్డి ఫస్టు క్లాస్ అడిషనల్ సేషన్ కోర్టు న్యాయమూర్తి జయంతి నలుగురు గంజాయి అక్రమ రవాణ నిందితులకు పదేళ్ల పాటు జైలు శిక్షతో పాటు రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారని మెదక్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ జె.హరి కిషన్ తెలిపారు. 2021 ఫిబ్రవరిలో 102 కేజీల గంజాయిని అక్రమంగా రవాణ చేస్తు ఉండగా జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ నమోదు చేశారు. సంగారెడ్డి ఎన్‌ఫోర్‌స్‌మెంట్ ఎస్సై హెచ్ఏ మోహన్‌కుమార్ రమేష్‌రెడ్డి గంజాయిని పట్టు కున్నారు. ఈ కేసును జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్సై ఎం.టి కుమార్ కేసు నమోదు చేశారని డీసీ తెలిపారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో వాదనలు విన్న న్యాయమూర్తి జయంతి రాథోడ్ మోహన్, రాథోడ్ వెంకట్, కేతావత్ పాండు నాయక్, రాథోడ్ మోతిరాంలకు పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.లక్ష చొప్పున జరిమాన విధించారు. గంజాయి నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు చేపట్టిన ఎక్సైజ్ సిబ్బంది డిప్యూటి కమిషనర్ హరి కిషన్ అభినందించారు.

మరో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

ఒరిస్సా నుంచి ఐదు కిలోల గంజాయిని అక్రమ రవాణ చేసిన సరజిత బిశ్వాస్ (36) అనే ఒరిస్సా మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన నిందితుడికి సంగారెడ్డి ఫస్టు క్లాస్ అడిషనల్ సేషన్ కోర్టు న్యాయమూర్తి జయంతి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా శుక్రవారం విధించారు. 2019లో ఒరిస్సా నుంచి గంజాయిని సంగారెడ్డిలో అమ్మకానికి తీసుక వచ్చిన బిశ్వాస్‌ను ఎన్‌ఫోర్‌స్‌మెంట్ ఎస్సై హెచ్ఏ మోహన్ కుమార్ పట్టుకున్నారు. సంగారెడ్డి సీఐగా ఉన్న మధుబాబు కేసు నమోదు చేసి దర్యాపు చేశారు. నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. ఇదే రోజు మరో కేసులో నలుగురికి పదేళ్ల పాటు శిక్షలు విధించారు. సంగారెడ్డిలో రెండు కేసుల్లో ఐదుగురికి శిక్షలు పడడానికి కృషి చేసిన ఎక్సైజ్ సిబ్బందిని మెదక్ డిప్యూటి కమిషనర్ జె.హరి కిషన్, ఈఎస్ శ్రీనివాసరావులు అభినందించారు.



ఎస్సీ కమ్యూనిటీ హాల్ స్థల పరిశీలన

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 28: గుండ్లపోచంపల్లి పరిధిలోని కండ్లకోయ గ్రామంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను శుక్రవారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఎస్సీ కమిటీ హాల్ స్థానంలో రాబోయే తరాల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో నూతన భవనం నిర్మించాల్సిన అవసరముందని తెలిపారు. ప్రజా పాలనలో రాష్ట్రన్ని అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ నెంబర్ జైపాల్ రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డీఈ దుర్గాప్రసాద్, కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి, కర్రల స్వామి, బైరీశ్వర్, రాజేందర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్తీక్ రెడ్డి, ఎర్రోళ్ల యాదగిరి, రమేష్, తలారి బిక్షపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ

ప్రతిపక్షం. మొయినాబాద్, నవంబర్ 28: స్వామి అయ్యప్ప.. శరణం అయ్యప్ప.. మణికంఠ మందారం.. గురుస్వాములు బంగారం అంటూ కరిమళవాసుడు అయ్యప్ప స్వామిని కొలుస్తూ శుక్రవారం మండల పరిధిలోని ఖాషీంబౌలిలో మాడి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మహాపడి పూజామహోత్సవం గురు స్వామి రామచందర్ సమక్షంలో వైభవంగా నిర్వహించారు. స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



పురాతన దర్గాను కూల్చేసిన దుండగులు

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 28: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కాజిగూడ లో ఏళ్ల తరబడి ఉన్నటువంటి ముస్లింల ఆరాధ్య దైవం దర్గాను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దర్గాను ధ్వంసం చేసిన వారు ఎంతటి వారైనా వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్.కె అక్బర్ పాషా తెలిపారు. దర్గాను కూల్చినవారు ఎవరైనా సరే వారికి తప్పకుండా తగిన బుద్ధి చెప్తామని ముస్లిం సోదరులు హెచ్చరిస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పట్టణంలో ఇప్పటివరకు అందరం అన్నదమ్ముల లాగా కలిసిమెలిసి ఉన్నామని, ఈ దర్గాను ఎవరు కూల్చారో అర్థం కావడంలేదని ముస్లిం సోదరులు వాపోతున్నారు.



బోడుప్పల్ లో ఇందిరమ్మ ఇండ్లు పంపిణి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 28: అర్హులైన ప్రతిఒక్కరికి ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు పంపిణి చేస్తుందని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో అర్హులైన 87 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మాజీ మేయర్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కళ్యాణ్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డితో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఇందిరమ్మ క్యాంటీన్‌లు

- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం,సిటి బ్యూరో, నవంబర్ 28 : గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమంకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ , డిప్యూటి మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్, కవాడి గూడ లలో ఇందిరమ్మ క్యాంటీన్ల ను జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మంత్రి, మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్, జీహెచ్ఎంసీ అధికారులు లబ్ధిదారులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శనం మేరకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సారధ్యంలో జీహెచ్ఎంసీ సౌజన్యంతో ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఉక్కు మహిళ ఇందిరమ్మ పేరుతో ఇందిరమ్మ క్యాంటీన్ లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ పేదలకు, అల్పాదాయ వర్గాలకు ఇందిరమ్మ క్యాంటీన్ లు ఎంతో ప్రయోజనకారంగా ఉంటాయన్నారు. ఇప్పటికే ప్రారంభించిన ఇందిరమ్మ క్యాంటీన్ లకు ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తుందని చెప్పారు. ఈ క్యాంటీన్ లలో లబ్ధిదారులకు సబ్సిడీతో అల్పాహారం రూ.5, భోజనం రూ.5 కు అందిస్తున్నామన్నారు. వాస్తవ ఖర్చు ఒక్కో బ్రేక్ ఫాస్ట్ పై రూ.19 కాగా, భోజనం పై 29.83 పడుతుందని, జీహెచ్ఎంసీ ఒక్కో బ్రేక్ ఫాస్ట్ పై రూ.14, భోజనంపై రూ.24.83 వెచ్చిస్తుందని తెలిపారు. ఆర్థికంగా భారమైన పేదల ఆకలిబాధలు దూరం చేసేందుకు ఇందిరమ్మ క్యాంటీన్ లు నిర్వహణకు జీహెచ్ఎంసీ ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ లో పేదలు, అడ్డా కూలీలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, అల్పాదాయ వర్గాల వారు, నిరుద్యోగులకు, మహా నగరం కు ఉపాధి కోసం, ఇతరత్ర పనుల కోసం వచ్చే ప్రజలకు ప్రయోజనం కలగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



2009లో కేసీఆర్ చేసిన దీక్ష పూర్తిగా నాటకం. ఆయన దీక్ష వల్ల తెలంగాణ రాలేదు. విద్యార్థుల ఆత్మబలిదానాలకు స్పందించి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది. కేసీఆర్ 'రాష్ట్రం కోసం దీక్ష చేస్తున్నా' అని చెప్పి నిమ్స్‌లో ఫ్లూయిడ్స్ తీసుకున్నారు. 'దీక్ష దివస్' పేరిట ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ సిద్ధమైంది.

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

ప్రాంతీయం



మీడియా సెంటర్ ను ప్రారంభించిన కలెక్టర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , నవంబర్ 28 : గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టరేట్ లోని డి పి ఆర్ ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి విధుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయాలని ఆమె సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎం సి ఎం సి కమిటీ సభ్యులు, డి పి ఆర్ ఓ, విజయలక్ష్మి,అడిషనల్ పి ఆర్ ఓ ఏడుకొండలు,మీడియా ప్రతినిధులు,డి పి ఆర్ ఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాత్మ పూలే వర్ధంతి

- **మహాత్మ జ్యోతి రావు పూలే త్యాగాలు మరువలేనివి**
- **ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్**


ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 28 : ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమ సమాజ స్థాపన కోసం నిరంతరం కృషి చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు సనాతన ధర్మం చదువుకు దూరం పెట్టింది ఎవరైనా పొరపాటున చదువుకుంటే కఠిన మైన సీసం పోసేవారు. అలాంటి ప్రజలను పూలే ప్రత్యేక పాఠశాలలు ఏర్పరిచి ప్రతి ఒక్కరికి విద్యను అందించి చైతన్యపరిచారు. కాబట్టి ఈరోజు ప్రతి ఒక్కరు ఇంత స్వేచ్ఛగా చదువుకోగలుగుతున్నామన్నారు. స్త్రీలకు అయితే చదువుకునే అవకాశమే లేకనప్పుడు తన భార్యను చదివించి ప్రయోజకురాలీని చేసి స్త్రీలకు కోసం పాఠశాలలను ఏర్పరిచారన్నారు. స్త్రీలు అంటే వంటింటికి మాత్రమే పరిమితం కావద్దు స్త్రీలు కూడా చదువుకోవాలి, స్త్రీలు కూడా పురుషులతో సమానమన్నారు ఆనాడే మహాత్మా జ్యోతి రావు పూలే అని కొనియాడారు.కాబట్టి ప్రతి విద్యార్థి, విద్యార్థినులు కూడా మహాత్మా జ్యోతి రావు పూలే అడుగుజాడలలో నడవాలన్నారు.బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి మహాత్మా జ్యోతి రావు పూలే.సనాతన ధర్మాన్ని కూకటి వేళ్ళతో పెకిలించిన గొప్ప మహానుభావుడని అన్నారు. మహాత్మ జ్యోతి రావు పూలే త్యాగాలు మరువలేనివన్నారు.ఆరోజు మహాత్మా జ్యోతి రావు పూలే అట్టడుగు వర్గాలకోసం పాఠశాలలు స్థాపించి విద్యను అందిస్తే,ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం మాత్రం నూతన విద్యావిధానం అనుకుంటూ విద్యను దూరం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు.కాబట్టి విద్యార్థిని,విద్యార్థులు అందరు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును పసిగట్టి ఎప్పటికప్పుడు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు లక్ష్మణ్,ఆకాష్,రామ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



కన్నుల పండుగగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

- **భారీ సంఖ్యలో తరలివచ్చిన అయ్యప్ప స్వాములు**
- **భక్త సంద్రంలో ముంచిన భజన గీతాలహరి**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 28 : స్వామియే శరణమయ్యప్ప.. హరి హరి వాసనే. శరణమయ్యప్ప అంటూ వేలాదిమంది అయ్యప్ప స్వాముల శరణు ఘోషతో పటాన్ చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ మార్మోగింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పటాన్ చెరు పట్టణంలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అభ్యంతం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దేవత మూర్తుల ఉత్సవ విగ్రహాలతో ప్రాంగణం మొత్తం శోభాయమానంగా తీర్చిదిద్దారు. శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయం నుండి వచ్చిన ప్రత్యేక పూజారులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా కొనసాగాయి. ప్రత్యేకమైన మండపం ఏర్పాటు చేసి సర్వంగా సుందరంగా రంగురంగుల పువ్వులతో అలంకరించారు. ముందుగా శ్రీ విఘ్నేశ్వర, శ్రీ సుబ్రమణ్యస్వామి, శ్రీ అయ్యప్ప చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహానికి పాలాభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించారు. పదునెట్టంబడిపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వాముల పెటతుల్లి భక్తులను ఆకట్టుకుంది. అనంతరం పదునెట్టంబడిపై దీపాలు వెలిగించారు.సుమారు 10 వేల మంది భక్తులు కార్యక్రమానికి హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రాజధాని అమరావతికి కేంద్రం రూ.15వేల కోట్లు ఇచ్చింది. ఇలాంటి ఫైనాన్షియల్ సిటీ దేశంలో ఎక్కడా లేదు. బ్యాంకుల ఏర్పాటు ద్వారా 6,541 మందికి ఉద్యోగాలు వస్తాయి. 2028 మార్చికి పూర్తయ్యేలా అమరావతి పనులు సాగుతున్నాయి. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఎంతగానో సహకరిస్తున్నారు.

- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడోత్సవాలు

- **లాంచనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

క్రీడలు, క్రీడాకారులకు సంపూర్ణ సహకారం



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 28 : విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా సహకారం అందిస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు లభిస్తాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన 44వ తెలంగాణ అండర్ 14 ఖో ఖో బాల-బాలికల అంతర్ జిల్లాల చాంపియన్షిప్-2025 పోటీలను టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కోకో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జంగా రాఘవ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుండి తరలివచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థి విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గ కేంద్రాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులకు క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా నిరంతరం ఉచిత శిక్షణ, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీలకు సైతం అతిథ్యం అందించబోతున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న క్రీడోత్సవాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే విధంగా క్రీడాకారుల శిక్షణ అందిస్తోందని తెలిపారు. ఈ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సిఐ వినాయక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కోకో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి కిషన్, కార్యదర్శి శ్రీకాంత్, మైత్రి క్రికెట్ల అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





నల్లమట్టి అక్రమ తవ్వకాల కేసులో లోకాయుక్త తీర్పు

- **సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు**



ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 28: అక్రమంగా రుద్ర సముద్రం గ్రామ చెరువులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నల్లమట్టి తవ్వకాలు జరుపుతున్న విషయాన్ని తెలుసుకొని కొంతమంది రైతులతో కలిసి తవ్వకాలు నిలిపివేయాలని, విచ్చలవిడి తవ్వకాల వల్ల మాకు నష్టం వాటిల్లుతుందని చెరువులోకి వెళ్ళి తవ్వకాలను అడ్డుకున్న సందర్భంగా అక్కడ ఉన్న కొంతమంది రైతులపై దుర్భాషలాడుతూ మీరు ఇక్కడి నుండి వెళ్లిపోలని బెదిరించారు. అక్కడ నుండి నేరుగా స్థానిక ఎమ్మార్వోకి నీటిపారుదల శాఖ అధికారులకు స్థానిక పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. పైగా వాటన్నిటికీ అనుమతులు ఉన్నాయి, మీరు అక్కడికి వెళ్ళవద్దు, మీరు ఎందుకు వెళ్లారు అని రైతులపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత ఆనాటి జిల్లా కలెక్టర్ కి మరియు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన కూడా సమస్యకు పరిష్కారం దొరకలేదు.న్యాయం కోసం తెలంగాణ లోకాయుక్తను ఆశ్రయించారు . తరువాతి క్రమంలో పై అధికారులకు లోకాయుక్త నోటీసులు జారీ చేసిన తర్వాత ఆనాటి నుండి నేటి వరకు ఇరువైపుల వాదనలు కొనసాగాయి. ఈ కేసులో గౌరవ లోకాయుక్తకు కూడా సంబంధిత అధికారులు తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు మక్తల్ కు చెందిన కాంట్రాక్టర్ కావాలి హరిని కాపాడే ప్రయత్నం చేశారు. అధికారులు చేసిన అధికార దుర్వినియోగాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం తప్పుడు కాగితాలను సృష్టించి, లేనివి ఉన్నట్టుగా చూపించే ప్రయత్నాన్ని చేశారు. వాటన్నిటిపై కౌంటర్ దాఖలు చేస్తూ చట్టబద్ధంగా అధికారులు చెప్పేవన్నీ అబద్ధాలని నిరూపణ అయింది. 2022 నుంచి నేటి వరకు ఇరువైపుల వాదనలు విన్న లోకాయుక్త తీర్పు వెలువరిస్తూ సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేసింది. అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా ఆరు నెలల్లో మళ్లీ లోకాయుక్తకు తెలియపరచాలని ఆదేశించింది. సంబంధిత అధికారులు కుమ్మక్కై ఒకరిద్దరు కాంట్రాక్టర్ల కోసం ధనార్జనే ధ్యేయంగా అన్యాయంగా నల్ల మట్టి తవ్వకాలు జరిపితే అది మొత్తం సమాజానికే ప్రమాదంగా చూడాలి. నల్లమట్టి తవ్వకాల పై రైతుల ఆవేదన మాత్రమే కాదు. సహజ వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా ఉండాలి. ఇష్టారీతిన నల్ల మట్టి తవ్వకాలు అనేది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. అధిక లోతు మట్టి తీయడం వల్ల భూమిలోకి నీరు ఇంకిపోవడంతో చెరువు పై ఆధారపడి జీవిస్తున్న అనేకమంది రైతుల పంట పొలాలకు సాగునీరు అందే అవకాశం కోల్పోతాయి. పర్యావరణం పై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అలాగే నీరు అందక పంటలు సమతుల్యతను కోల్పోయి తీవ్రమైన సంక్షోభంలోకి వ్యవసాయ రంగం వెళ్ళిపోతే రైతులు ఆత్మహత్యలే శరణ్యంగా భావించే ప్రమాదముంది.

సైన్స్ ను అందిపుచ్చుకుని కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి

- **సైన్స్ ద్వారానే ప్రకృతిలో దాగి ఉన్న నిజాలు తెలుసుకోగలం**
- **చిట్యాల గురుకుల పాఠశాలలో ఘనంగా జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన**
- **హాజరైన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 28: రోజురోజుకు సాంకేతికపరంగా అనేక మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు సైన్స్ ను అందిపుచ్చుకుని కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు.శుక్రవారం వనపర్తి మండలం చిట్యాల లో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 202526, ఇన్స్పైర్ అవార్డ్స్ 202425 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో విద్యార్థుల్లో లాజికల్ థింకింగ్ పెంచడం కోసం సైన్స్ ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేకంగా పుస్తకాన్ని రూపొందించారు.ఈ సందర్భంగా ఆ పుస్తకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలను కలెక్టర్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమానికి 150 పాఠశాలల నుండి విద్యార్థులు హాజరవుతున్నారు. మొత్తం 270 వైజ్ఞానిక ప్రజలు ఇక్కడ ప్రదర్శించనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి కొత్త కొత్త ఆలోచనలపై దృష్టి సారించి సాంకేతిక రంగంలో ఎదగాలన్నారు.రోజురోజుకు సాంకేతిక పరంగా అనేక మార్పులు వస్తున్నాయని,వాటికి అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. సైన్స్ అంటేనే నిజం అని, సైన్స్ ద్వారా ప్రపంచంలో ప్రకృతిలో దాగి ఉన్న నిజాలను తెలుసుకోవచ్చని చెప్పారు.సైన్స్ ను అలవర్చుకుంటే జీవితంలో ముందుకు వెళ్ళగలమని చెప్పారు. మనం ఇక్కడి నుండే ఇతర గ్రహాల పైన డ్రోన్లను ఆపరేట్ చేయగలుగుతున్నామని,అంతగా సాంకేతికత అభివృద్ధి చెందిందని తెలిపారు.సైన్స్ పై ఆసక్తి పెట్టి విద్యార్థులు పరిశోధనాత్మక విధానంలో ప్రతి విషయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు.సమాజంలోని సమస్యల పరిష్కారానికి మార్గం సైన్స్ చూపిస్తుందని, అది సృజనాత్మక ఆలోచనలతోనే సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు.సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతుందని,ఈ నేపథ్యంలో కొత్త ఆవిష్కరణల ద్వారా ప్రతీ రంగం అభివృద్ధి అంచెలంచెలుగా జరుగుతుందన్నారు.ప్రపంచం ఆధునిక సాంకేతికత వైపు పరుగెడుతుందని, విద్యార్థులు సైన్స్ లో ప్రతీ అంశాన్ని క్షుణంగా అధ్యయనం చేసి తెలుసుకోవాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ ను పరిశీలించి వాటికి సంబంధించి ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యాశాఖ కోసం కలెక్టర్ చేస్తున్న కృషిని వివరిస్తూచేస్తున్న కృషిని వివరిస్తూ విద్యాశాఖ వివరిస్తూ అధికారులు కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, జి సి డి ఓ శుభ లక్ష్మి, చిట్యాల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, ఇతర విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయం

పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ హైమావతి



ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 28: అత్యంత పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ హైమావతి ఆదేశించారు. సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం కలెక్టర్ ములుగు మండలం వంటిమామిడి శివారులోని రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్ఎస్టి శిబిరాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రోజు ఇప్పటివరకు 96 వాహనాల తనిఖీ చేసినట్లు సిబ్బంది కలెక్టర్ తో తెలుపగా, తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేశారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 24/7 ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మొత్తం ప్రక్రియ వీడియోలో తియ్యాలని ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని శిబిర అధికారులను ఆదేశించారు. అలాగే ములుగు మండలం చిన్న తిమ్మాపూర్ గ్రామపంచాయతిలో నామినేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చిన్న తిమ్మాపూర్ క్లస్టర్లో తునికి బొల్లారం, చిన్న తిమ్మాపూర్, జప్తి సింగయ పల్లి గ్రామాల నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ కలెక్టర్ కు తెలిపారు. గజ్వేల్ మండలం రిమ్మనుగూడ గ్రామపంచాయతిలో నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిమ్మనుగూడ క్లస్టర్ లో రిమ్మనుగూడ, బూరుగుపల్లి, కొడకండ్ల గ్రామాల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. క్లస్టర్ చుట్టూ 144 సెక్షన్ అమలు చేస్తూ 100 మీటర్లలోపు నామినేషన్ అభ్యర్థి తో మరొక ఇద్దరికీ మాత్రమే లోనికి అనుమతించాలని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులు ఆదేశించారు.

పది విద్యార్థులకు అల్పాహారం అందించాలి

- ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 28: పది విద్యార్థులకు అల్పాహారం (స్నాక్స్) అందజేయాలని ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్షలకు ప్రభుత్వ బడుల విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు స్పెషల్ క్లాస్ కోసం సాయంత్రం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే స్నాక్స్ ఇవ్వాలన్నారు. రాష్టంలో దాదాపు 2 లక్షల మంది ప్రభుత్వ బడుల్లో పదో తరగతి చదువుతున్నారని తెలిపారు. ఇప్పటికే స్పెషల్ క్లాస్ కోసం గ్రామీణ విద్యార్థులు ఉదయనే ఆదరాబాదర గా బడికి వస్తుంటారని తెలిపారు. విద్యార్థులు సాయంత్రం ప్రత్యేక తరగతులకు హాజరయ్యే దూర ప్రాంత విద్యార్థులు ఆకలి తో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడి, ఆకలితో చదువు మీద దృష్టి పెట్టలేక పోతారని పేర్కొన్నారు. గత ఏడాది మాదిరిగా ఈ సారి పదవ తరగతి చదివే విద్యార్థులకు అల్పాహారం అందించాలని కోరారు. కనీసం పేద విద్యార్థుల కోసం ప్రతి విద్యార్థికి రూ. 10 కూడా ఖర్చు చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. వచ్చే నెల నుంచి విద్యార్థులకు అల్పాహారం అందించాలని డిమాండ్ చేశారు. దీనితో చదువు పై పూర్తి స్థాయిలో దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు.



కుల వాద చీకటి మీద వెలసిన తొలి వెలుగు 'పూలే'

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలీట్ బ్యూరో సభ్యులు మైసరాములు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 28: జ్యోతీ బా పూలె సత్య శోధక సమాజం ఏర్పాటు చేయడంతో మహారాష్ట్రలో బ్రాహ్మణేతర ఉద్యమం ఒక నిర్దిష్టమైన రూపాన్ని సంతరించుకున్నదని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర పొలిటికల్ బ్యూరో సభ్యులు మైసరాములు, మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామిలు అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నాడు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీడిత ప్రజలలో, బాంబే కార్మిక వర్గంలోనూ, రైతాంగంలోనూ, పూనాలో ఆ చుట్టుపక్కల ఉన్న అంటరాని వారిలోనూ పూలే తన కృషిని కేంద్రీకరించా డన్నారు. పాలనా యంత్రాంగంలో వంశపారంపర్య పదవులు రద్దు కోసం ఆయన పోరాడాడనీ దీంతో ఆయన రైతాంగంతో నిలకడగా మైత్రి నెరపడానికి దోహదం చేశాయి అన్నారు. బ్రాహ్మణ వాద ఆధిపత్య కుల భావ జాలానికి వ్యతిరేకంగా జ్యోతి బా పూలే కొనసాగించిన కుల నిర్మూలన పోరాటం పరోక్షంగా వర్గ పోరాటమే, భూస్వామ్య, పెట్టుబడి దారి వర్గాలకువ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని, కుల నిర్మూలనా పోరాటాన్ని కొనసాగించిన గొప్ప ఉద్యమ కారుడు జ్యోతిరావు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు టీచర్ సత్యానారయణ,సినియర్ దళిత నాయకులు పొన్నాల కుమార్, తుమ్మ శ్రీనువాస్, మైస రాములు, దాసరి ఏగొండ స్వామి, బ్యాగరి వేణు, కనక ప్రసాద్, రాజు సంఘం నాయకుడు బాకీ స్వామి, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అట్టకూరి రాములు, మైస స్వామి, గిల్క చందు, బెజ్జంకి ప్రవీణ్ కుమార్, సింగాటం చంద్రం, బాలేష్, మల్లేశ తదితరులు పాల్గొన్నారు.



రెండవ రోజు జోరుగా నామినేషన్లు

- సర్పంచ్ స్థానాలకు152, వార్డుల్లో 186
- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 28: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండవ రోజు సర్పంచ్ స్థానాలకు152, వార్డుల్లో 186 నామినేషన్లు దాఖలయ్యాయి. అల్లదుర్గ్ లో 14 సర్పంచ్,11 వార్డు సభ్యులు, హవేలీ ఘనాపూర్ లో 49 సర్పంచ్, 65 వార్డు సభ్యులు, పాపన్నపేట్ లో 25 సర్పంచ్, 22 వార్డు సభ్యులు, రేగోడు లో 18 సర్పంచ్,11 వార్డు సభ్యులు, శంకరం పేట్ (ఏ) సర్పంచ్ 17, 40 వార్డు సభ్యులు, టేక్మాల్ 29 సర్పంచ్, 37 వార్డుల్లో అభ్యర్థులు నామినేషన్లు వేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల రాజ తెలిపారు.



వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీలు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 28: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజు జిల్లాలోని టీ హబ్, ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్, టీబీ క్లినిక్ ను ఆకస్మికంగా సందర్శించారు. టీబి క్లినిక్ సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న టీబీ టెస్టుల, మందుల సరఫరా, మందుల లభ్యత, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఐసీటీసీ ఏఆర్టీ సెంటర్లను సందర్శించి సెంటర్లో హెచ్ఐవీ టెస్టుల నిర్వహణ, సరఫరా రికార్డులను పరిశీలించారు. ఐసీటీసీ సెంటర్లో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు హెచ్ఐవీ పరీక్షలతో పాటు టీబీ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రికార్డులను పరిశీలించారు. టీ హబ్ సందర్శించి టీ హబ్లో ఇప్పటివరకు నిర్వహించిన రక్త నమూనాలను సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి కొన్నిసూచనలు చేశారు. ఆయన వెంట వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, టీబీ క్లినిక్ వైద్యాధికారి ఐసీటీఎస్ మేనేజర్ అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



కొమురవెల్లి మల్లన్న ఉత్సవ కమిటీ ఏర్పాటు

- కాంగ్రెస్ నేతల హర్షం

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 28: శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ ఏర్పాటుపై జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనక శివరాజ్ యాదవ్, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కొమురవెల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త కమిటీ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపాదించిన 14 మంది సభ్యులతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆమోదం తెలపగా, టెక్నికల్ కారణాలతో 12 మంది సభ్యులను మాత్రమే నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. డిసెంబర్ 14న జరిగే స్వామివారి కళ్యాణం, అనంతరం జరిగే జాతర వేడుకలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉత్సవ కమిటీని నియమించిందని, ప్రస్తుత ట్రస్ట్ బోర్డు పదవీకాలం డిసెంబర్ 6తో ముగియడంతో, ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటం వల్ల కొత్త ట్రస్ట్ బోర్డు ఏర్పాటు సాధ్యం కాక ఉత్సవ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కొత్త కమిటీలో ఇద్దరు ఓసీ, 2 ఎస్సీ, 8 మంది బీసీ వర్గాలకు చెందిన వారే ఉండటం విశేషమని, దేవాలయ చరిత్రలో తొలిసారిగా గొల్ల -కురుమ వర్గాలకు ఐదు స్థానాలు లభించాయని అన్నారు. కొత్త కమిటీ నియామకంపై వ్యక్తిగత స్వార్థంతో విమర్శలు చేస్తున్న కొంతమంది నేతల ప్రవర్తనను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కుల రాజకీయాలతో దేవాలయ ప్రతిష్టను దెబ్బతీయకూడదని, పార్టీపై అసభ్య వ్యాఖ్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల బ్లాక్ అధ్యక్షుడు మంజ మల్లేశం, నాయకులు గుండ మహేష్, పయ్యావుల ప్రవీణ్ యాదవవ్, వివిధ మండలాల అధ్యక్షులు కొమ్ము రవి, లింగాల నర్సిరెడ్డి, ఆర్. లక్ష్మీనారాయణ, చెంచారపు బుచ్చిరెడ్డి, జనగామ ప్యాక్స్ డైరెక్టర్ వంగల మల్లారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ముత్యాల యాదగిరి, చెవిటి లింగం, కొమురవెల్లి పట్టణ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజ్, కొమురవెల్లి మండల బీసీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్, కొమురవెల్లి మండల యూత్ అధ్యక్షులు ఏర్పుల రాజు, మాట్ల మురళి, ఎనిశెట్టి కిరణ్, ఉప్పల వంశీ, కొరిమి శ్రీనివాస్, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ చింతల రమేష్, సోషల్ మీడియా యూత్ కన్వీనర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి గ్రామంలో మన కాంగ్రెస్ జండా ఎగరాలి

- సర్పంచ్, వార్డు మెంబర్లు అన్నిస్థానాలు మనమే కావాలి
- కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 28: నియోజకవర్గంలో ఉన్న సర్పంచ్ స్థానాలలో మనవాళ్లే,మన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంప్ ఆఫీసులో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల గ్రామాల పార్టీ శాఖ అధ్యక్షులతో తో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులే సర్పంచులుగా గెలవాలని ఒక వార్డును సైతం వదలకుండా అన్ని వార్డులలో మన వాళ్లే గెలుపు పొందాలని అందుకు మండల శాఖ గ్రామ శాఖ అధ్యక్షులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడపగడపకు తీసుకువెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, జిల్లా మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాలీముద్దీన్ అహ్మద్‌బొమ్మల యాదగిరి, దాస అంజన్న, మిట్టపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వివిధ మండలాల అధ్యక్షులు బిక్షపతి, మీసం మహేందర్ యాదవ్, బర్మా రాజ మల్లయ్య, అంజిరెడ్డి,రాములు,యూత్ కాంగ్రెస్ నాయకులు వాహబ్,మేరుగు రాజు,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ డాక్టర్స్‌సెల్ మెడికల్, హెల్త్ వింగ్ చైర్మన్ గా

డా. సంతోష్ కుమార్

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 28 : జనగామ జిల్లా డీసీసీ డాక్టర్స్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్ గా ఎడెల్లి సంతోష్ కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు గాంధీభవన్లోని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. తాను చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. తమ ఎన్నికకు కృషి చేసిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,జనగామ డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ సభ్యులు పార్టీ కోసం పని చేయాలి

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 27 : యువజన కాంగ్రెస్ సభ్యులు స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని యువజన కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షులు పరశారం గౌడ్ అధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర అధ్యక్షులు శివచరన్ రెడ్డి, జాతీయ కార్యదర్శి భవ్య సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆయన తెలిపారు. యూత్ కాంగ్రెస్ లో పనిచేసే ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో మంచి పదవులు వస్తాయని తెలిపారు. రాబోయే పంచాయితి ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని తెలిపారు, యువజన కాంగ్రెస్ కు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చాలా అవకాశాలు ఇస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే మొన్న ప్రకటించిన డీసీసీ అధ్యక్షులల్లో 8 మంది యువజన కాంగ్రెస్ వారికి అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ భవ్య సింగ్ మాట్లాడుతూ మా కుటుంబంలో ఎవరు రాజకీయాలలో లేరు, ఐనా కూడా ఒక సాధారణ మహిళానైన నాకు జాతీయ స్థాయిలో అవకాశం కలిపించింది అంటే అది యువజన కాంగ్రెస్ వల్లనే అని తెలియచేశారు, కావున జిల్లాలో యువజన కాంగ్రెస్ ను బలోపేతం చేయడం పైన దృష్టి పెట్టాలని తెలిపారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర వహించేది యువజన కాంగ్రెస్ సభ్యులని, స్థానిక ఎన్నికలలో పెద్ద మొత్తంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు సంతోష్, తరుణ్, రామ్ చందర్ రెడ్డి, మెదక్ అసెంబ్లీ అధ్యక్షుడు భరత్ గౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు సందీప్, జిల్లా నలుమూలల నుండి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



డీసీసీ డాక్టర్స్‌సెల్ మెడికల్, హెల్త్ వింగ్ చైర్మన్ గా డా. అంతగిరి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 28 : సిద్దిపేట జిల్లా డీసీసీ డాక్టర్స్ సెల్ మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్ గా శనిగరం అంతగిరి నియామకమయ్యారు. ఈ మేరకు గాంధీభవన్ లోని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అంతగిరి మాట్లాడుతూ.. ఈ బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేస్తానని అన్నారు.



కూటమి ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేస్తోంది. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎంతగానో సహకరిస్తోంది. ప్రధాన బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా కార్యాలయాలు ఒకేచోట ఉండటం వల్ల వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలు వేగంగా సాగుతాయి. బ్యాంకుల శంకుస్థాపన కార్యక్రమం భవనాలకే కాకుండా ఏపీ భవిష్యత్తుకు పడిన పునాది అవుతుంది.

-ఏపీ డిప్యూటీ సీఎం పవన్

ప్రాంతీయం



పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ జరగాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 27 :- గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమా నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్లు రెండో రోజు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు చర్యలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులకు సమాన అవకాశాలను కల్పించాలని, అలాగే నామినేషన్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, శాంతి యుత వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం స్పందిస్తూ సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి విడత నామినేషన్లకు 29వ తేదీ చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'చెక్ డ్యాం కూల్చివేత' పై న్యాయ విచారణ జరిపించాలి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 28: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామ శివారులోని మానేరు నది పైన గల చెక్ డ్యాం ఇటీవల కూలిపోయిన నేపథ్యంలో కూల్చివేత ఘటన పై జ్యుడిషియల్ ఎంక్వైరీ జరిపించాలని కోరుతూ మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి కి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే చెక్ డ్యామ్ పేల్చివేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెంట హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీవి రామకృష్ణ, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్ లు ఐలెందర్ యాదవ్, ఎడ్ల అశోక్, జంగిలి సాగర్, దుర్షేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, నాయకులు కర్ర సూర్య శేఖర్, నేతి రవివర్మ, మీడిదొడ్డి నవీన్, వోడ్నాల రాజు , పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, చేతి చంద్రశేఖర్, రాజు, ఆరే రవి, నాయకురాలు గంటల రేణుక .. పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శ

మాజీ కార్పొరేటర్ కుర్ర తిరుపతి భార్య కుర్ర తిరుమల చల్మెడ ఆనందరావు హాస్పిటల్లో చికిత్స పొందుతూ అకాల మరణం చెందడంతో.. నేడు మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆసుపత్రికి వెళ్లి తిరుపతిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దీక్ష దీవస్ పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహించబోయే దీక్షదివస్ కార్యక్రమానికి సంబంధించి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శాతవాహన విశ్వవిద్యాలయంలో రేపు నిర్వహించబోతున్న దీక్ష దీవాస్ పోస్టర్ ఆవిష్కరణ గోడ ప్రతులను నేడు మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించారు.

భౌతికకాయానికి నివాళు

కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆఫీస్ బాయ్ ములుకుంట్ల రాజు సోదరుడు ములుకుంట్ల కిషోర్ అకాల మరణం చెందడంతో ఇందిరా నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి వారి కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



విద్యా ప్రమాణాలు పాటించాలి

- మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి
- జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 28: విద్యా ప్రమాణాలు పాటించడంతో పాటు ప్రతి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాస రెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నంగునూరు మండలంలోని కొండంరాజు పల్లి ప్రాథమిక పాఠశాల, గట్లమల్యాలలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు అన్ని సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఫిబ్రవరిలో నిర్వహించే పరక్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంను మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఆయా పాఠశాలల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం సిద్ధన్నపేటలో విద్యార్థులు లేకపోవడంతో మూసివేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని పరిశీలించారు.




నార్సింగి మండల తపస్ అధ్యక్షులుగా తిగుళ్ల స్వామి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 28: నార్సింగి మండల తపాస్ అధ్యక్ష కార్యదర్శులుగా తిగుళ్ల స్వామి, రాగ వేందర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తపాస్ మెదక్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జడ్జి ఎల్లం, చల్లా లక్ష్మణ్ తెలిపారు. తిగుళ్ల స్వామి నార్సింగి జిల్లా పరిషత్ హైస్కూల్ లో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు సంతోష్, జెట్టి మల్లేశం, రాజశేఖర్, బండి నరేష్, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు కృషి చేయాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 28: గ్రామపంచాయితీ ఎన్నికలను చట్టానికి లోబడి, ప్రశాంత వాతారణంలో ఎన్నికలు సజావుగా జరిగేల అధికారులు కృషి చేయాలనీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో భేషజాలకు వెళ్ళకుండా, కార్యకర్తల సమిష్టి నిర్ణయంతో అభ్యర్థులను ఎంపిక చేయాలనీ సూచించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ధర్మారం మండల వ్యాప్తంగా రెండో విడత ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు చేసారు. ఈ సందర్బంగా మంత్రి అడ్లూరి మీడియాతో మాట్లాడుతూ. పార్టీ గుర్తు లేకుండా స్వతంత్రంగా జరిగే ఈ గ్రామా పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంగా పని చేయాలన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తిసుకువేల్లాలని చెప్పారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త పని చేసి, ప్రజల మెప్పును ఓట్ల ద్వారా పొందాలని కోరారు .ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిరిసిల్లలో విషాదం..

- మానేరు వాగులో దూకి తల్లి ఆత్మహత్య
- అదే వాగులోకి దూకి ప్రాణాలు తీసుకున్న కుమారుడు

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 28: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన మంచికట్ల లలిత గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి కనిపించకపోవడంతో కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం తంగళ్లపల్లి మానేరు వాగు బ్రిడ్జ్ సమీపంలో లలిత మృతదేహం లభ్యం కావడంతో అది చూసిన కొడుకు అభిలాష్ నిమిషం కూడా ఆలోచించలేదు. అమ్మను కోల్పోయిన వేదనలో అదే వాగులోకి దూకేశాడు. 2013 బ్యాచ్‌కు చెందిన సర్దాపూర్ 17వ బెటాలియన్ కానిస్టేబుల్ అభిలాష్ ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. అందరూ చూస్తుండగానే కళ్లెదుట జరిగిన సంఘటనతో పోలీసులు షాక్ గురయ్యారు. ఎస్డీఆర్ఎఫ్ బృందం గాలింపు, స్థానిక పోలీసుల సహాయంతో గంటల పాటు నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో అభిలాష్ మృతదేహం వెలికితీశారు. తల్లి కొడుకు ఒకే వాగులో మృతి చెందడంతో తంగళ్లపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమతో కలిసి పనిచేసిన యువ కానిస్టేబుల్‌ను కోల్పోవడంతో బెటాలియన్ పోలీసులు కంటతడి పెట్టారు.



కాలభైరవుడిని దర్శించుకున్న పద్మా దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 27: మెదక్ మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో శ్రీకాలభైరవ స్వామి 15వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ కాలభైరవ స్వామి వారిని శుక్రవారం మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలభైరవ స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు అందరు సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు తాళ్లపల్లి రాజశేఖర్, పద్మా దేవేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తపల్లి కిష్టయ్య, మాజీ సర్పంచ్ స్వప్న, సిద్ధూ, బీఆర్ఎస్ నాయకులు మాధవ రావు, వెంకట్రావు, కిషన్, రాజా గౌడ్, బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు బ్లాంకెట్ల పంపిణీ

- సత్యసాయి సేవా సమితి ఉదారత

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, నవంబర్ 28: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రామంచ గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిరుపేదలకు బ్లాంకెట్లను పంపిణీ చేశారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా సిద్దిపేట సేవాసమితి సభ్యులు వీటిని అందించారు. ఈ బ్లాంకెట్లను వృద్ధులు, దివ్యాంగులైన వారికి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాంసాని వెంకట సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, ఆబేదా బేగం, నాగమణి, వరప్రసాద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

“



తుఫాన్ కారణంగా రేపు, ఎల్లుండి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు సోమవారం వరకు అప్రమత్తంగా ఉండాలి. వర్ష ప్రభావం అధికంగా ఉండే తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచాలి. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి.

- ఏపీ హోంమంత్రి అనిత

పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలి

- ప్లాస్టిక్ ను వినియోగించవద్దు
- సీవీ రామన్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు ఎదగాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల గీతానగర్ జడ్పీ హైస్కూల్లో జిల్లాస్థాయి ఇన్ స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 28: విద్యార్థులు పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వికసిత్, ఆత్మ నిర్భర్ భారత్ లో భాగంగా పాఠశాలల విద్యార్థుల జిల్లాస్థాయి ఇన్ స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన, రాజ్యస్థరీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్ఎస్ బీవీపీ) శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ ను పరిశీలించి, ఎలా తయారు చేశారు? వాటి వినియోగం, వచ్చే ఫలితాలను అడిగి తెలుసుకుని, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రయోగాలు చేయాలని సూచించారు. ప్రయోగాలతోనే ఆ పాఠ్యాంశంపై మంచి అవగాహన వస్తుందని, అది ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సీవీ రామన్, అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం ప్రయోగాలు చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సౌర విద్యుత్, పవన విద్యుత్, థర్మో డైనమిక్స్, కిరణజన్య సంయోగ క్రియ తదితర అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. సైన్స్ మ్యూజియం కోసం కావలసిన స్థలం కోసం ప్రతిపాదనలు పంపాలని, వివిధ సైన్స్ పరికరాలపై విద్యార్థులకు అవగాహన వచ్చేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చేగుంట ఏఎంసీ చైర్మన్ కు నార్సింగి నేతల సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 28: చేగుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా నియామకమైన తాడేపు వెంగళరావును దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి సమక్షంలో నార్సింగి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు సేవాదళ్ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చెరుకు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వెంగళరావు రైతుల పక్షపాతిగా నిలిచి ప్రజల మన్ననలు పొందాలని గుర్తు చేశారు. దుబ్బాక నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ల నియామకం చేయడం జరిగిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్లుగా నియామకమైన నేతలు కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తేవాలని శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవల రాష్ట్ర నాయకులు వీరప్ప యాదగిరి యాదవ్, కాంగ్రెస్ నాయకులు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, రాజేష్, స్వామి పాల్గొన్నారు.

ప్రాంతీయం

800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- **ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 28: ఇటీవల హైదరాబాదులో జరిగిన మంత్రుల కేబినెట్ సమావేశంలో రామగుండంలో 8 వందల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లాకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్లాంటు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిన క్రమంలో రామగుండం ప్రజల పక్షాన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ప్లాంట్ల ఏర్పాట్ల లో ముఖ్య పాత్ర పోషించిన ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు, మంత్రి జూపల్లి కృష్ణా రావు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత రెండేళ్ల నుంచి కోట్లాది రూపాయల నిధులతో రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇదే క్రమంలో ప్లాంట్ ఏర్పాటు పై మొదటి నుంచి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కల సాకారం కావడం పట్ల ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటు ఏర్పాటు వల్ల స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధి తోపాటు అర్హత కలిగిన యువత కు ఉపాధి అవకాశాలు దక్కుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన రామగుండంలో జెన్కో విద్యుత్ ప్లాంట్ స్థానంలో 800 మెగావాట్ల ప్లాంటు ఏర్పడితే ఈ ప్రాంత రూపు రేఖలు మారుతాయని అన్నారు. స్థానికంగా వేలాది మంది కి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని ఆయన పేర్కొన్నారు.



జిల్లెల్ల చెక్ పోస్ట్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 28: గ్రామపంచాయతి ఎన్నికల సందర్భంగా తంగాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెల్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ఈరోజు ఆకస్మిక తనిఖీ చేసి వాహన తనిఖీలు చేసి నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించడంతో పాటు, ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తనిఖీల సమయంలోసిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించందం తో పాటు,వాహనాలను క్షుణ్ణముగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎస్పీ వెంట సీఐ మొగిలి, చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

ప్రతిపక్ష పార్టీలకు ఓటమి తప్పదు

- **మంత్రి వివేక్ వెంకటస్వామి**



ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, నవంబర్28: రాష్ట్రంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజమేనని ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి ఓటమి తప్పదని రాష్ట్ర కార్మిక, ఉపాధి గనులశాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తున్న కేటీఆర్ వారి ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతి గురించి ప్రజలకు తెలియదనుకోవడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో మంత్రి మార్నింగ్‌వాక్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల జాబితా ఎక్కువైందని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రణాళిక బద్ధంగా చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పట్ల ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని తప్పకుండా ఈ ఎన్నికలు కూడా ఏకపక్షంగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచాచం చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన కుటుంబకోణాలు అవినీతిని ప్రచారాస్త్రాలుగా చేస్తామని అన్నారు. ఎక్కడ చూసిన అవినీతి అని కోలుకోలేని విధంగా దెబ్బతీశారని ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలోని గ్రామ పంచాయతీలోని గెలిచితీరుతామన్నారు. రెండు రోజులుగా ఆయన ఐదు మండలాల్లో విస్తృతంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ఆశావహులతో విరివిగా సమావేశాలు నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు రఘునాత్ రెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 28: రామారెడ్డి మండలం అన్నారం గ్రామ పంచాయితి కార్యాలయం లో ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రక్రియ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. 2 వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అన్నారు. క్రవారం జిల్లాలోని రామారెడ్డి మండలం అన్నారం గ్రామపంచాయతీ కార్యాలయం లో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 3 విడతలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ లో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఉమాలత మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

- **రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 28: బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు,పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ సభలో బీసీలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ తీర్మానాలతో నూ బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదని రేవంత్ సర్కార్ కు తెలుసని రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతది అనేది వాస్తవం ఇది అక్షర సత్యం అన్నారు.బిజెపికి కాంగ్రెస్ పార్టీ కి రాబోవు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పని చేయాలని మోసపూరిత కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలంతా బుద్ధి చెప్పాలన్నారు .ఎన్నికల్లో ప్రజల ను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేక పోయిందని ఆరోపించారు. రామగుండం నియోజకవర్గంలో ఉన్న 27 గ్రామపంచాయిలకు బీఆర్ఎస్ పార్టీ నుండి ప్రతి గ్రామానికి ఇంచార్జీలను, కో ఆర్డినేటర్ లను ప్రకటించుకోవడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరూ కలసి కట్టుగా పనిచేయాలని కోరారు. అంతకుముందు మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, గోపు అయిలయ్య యాదవ్, బోద్దు రవీందర్, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణ వేణీ, గాధం విజయ, బాదె అంజలి, పర్లపల్లి రవి, నారాయణదాసు మారుతి,మేడి సదానందం, కాల్వ శ్రీనివాస్, బుర్ర శంకర్, పిల్లి రమేష్, శ్రీనివాస్ బస్వ రాజ్ గంగరాజు, తోకల రమేష్, గుర్రం పద్మ, శ్రావన్, రామకృష్ణ,కీరన్ జీ,చింటూ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన సాకెర గ్రామ కాంగ్రెస్ నాయకులు

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 28 : మండలం సాకెర గ్రామ తాజామాజీ వార్డు మెంబర్ లక్ష్మి ఉదయ్ తో పాటు, పలువురు నాయకులు శ్రావణ్, కిరణ్ లు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారి సమక్షంలో భారతీయ జనతా పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గారు వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, తాజా మాజీ ఎంపీపీ హరీష్ రెడ్డి, నాయకులు సుంచు సవీన్, పోషెట్టి,తో పాటు తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, నవంబర్ 28: జిల్లా లోని సర్పంచ్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను శుక్రవారం ఎస్పీ రాజేష్ చంద్ర తనిఖీ చేశారు. ఎన్నికల శాంతిభద్రతల కోసం కట్టుదిట్టమైన పోలీస్ పర్యవేక్షణ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల ద్వారా సమగ్ర తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల తొలి విడత నామినేషన్ల సందర్భంగా భిక్నూర్ మండలం జంగంపల్లి గ్రామపంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, నామినేషన్ ప్రక్రియ నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగాలని సూచించారు. ఎలాంటి అంతరాయం లేకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు.ఎన్నికల భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 25 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 5 స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, 2 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, 3 అంతర్జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను కఠినంగా పర్యవేక్షిస్తూ, ఈ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని రకాల చర్యలు తీసుకోబడుతున్నాయని ఎస్పీ తెలిపారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం




ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 28: గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యం లో శుక్రవారం క్లబ్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కరీంనగర్ మెడ్ కవర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐజేయుఅనుబంధ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎం.వంశీ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పూదరి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా, పలువురు సీనియర్ జర్నలిస్టుల తో కలిసి వంశీ,పూదరి కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆధునిక సమాజంలో అనేక రకాల వ్యాధులు మానవ జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయ ని అన్నారు. ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులతో అకాల మరణం పొందుతున్న వారిసంఖ్య అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అనేక ఒత్తిళ్ల మధ్య వృత్తిని కొనసాగించే జర్నలిస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.క్లబ్ విజ్ఞప్తి మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం,శిబిరానికి హాజరైన సుమారు 150 మంది జర్నలిస్టు లు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ళ శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన శిబిర ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి గడ్డం శ్యాం కుమార్, సీనియర్ జర్నలిస్టులు అల్లంకి లచ్చయ్య,కోల లక్ష్మణ్,సిరిమల్ల మధు దయానంద్ గాంధీ,కె.చంద్రశేఖర్, పాలకుర్తి విజయ్ కుమార్, మ్యాజిక్ రాజా,కె ఎస్ వాసు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు బైరం సతీష్, మామిడి సత్యనారాయణ, శంకర్,ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్,మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్,బొంగోని హరీష్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పోలీస్ వాహనంపై కట్టేసి ఆందోళన

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 28 : జిల్లాలోని ఎర్గట్ల మండలం లోయువకుడి మృతదేహాన్ని పోలీస్ వాహనంపై కట్టి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. దోంచందా గ్రామానికి చెందిన నాగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి (29) ప్రేమించి మోసపోయానని మనస్తాపంతో ఈ నెలానవంబర్ 6న విషం తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీకాంత్ ను ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్ లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బంధువులు యువకుడి మృతదేహంతో శుక్రవారం ఉదయం ఏర్గట్ల కు తీసుకువచ్చి శ్రీకాంత్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్ ముట్టడికి యత్నించారు. గ్రామస్థులను పోలీసులు తాళ్లరాంపూర్ రోడ్డులో అడ్డుకున్నారు. దాంతో ఆగ్రహంతో బంధువులు మృతదేహాన్ని పోలీస్ వాహనంపై కట్టేశారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు.



"

రైతుల త్యాగ ఫలితమే అమరావతి. గత ప్రభుత్వం దీన్ని విధ్వంసం చేయడానికి ప్రయత్నించింది. మూడు రాజధానులు అని చెప్పి ఒక్క ఇటుక కూడా వేయలేదు. ఒకే రాజధాని ఒకే రాష్ట్రం అనే నినాదంతో 1,631 రోజులపాటు రైతులు ఉద్యమం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి.

-ఏపీ మంత్రి నారా లోకేశ్



బీజేపీలో చేరిన లక్ష్మణచాంద మండల నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 28: లక్ష్మణచాంద మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు వడ్యాల్ గ్రామానికి చెందిన గై. శ్రీనివాస్, తాజా మాజీ వార్డు మెంబర్ సాగర్, కనకాపూర్ గ్రామ నాయకులు తిరుపతి తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీ లో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు గడప గడపకు చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిన్నయ్య, తాజా మాజీ ఎంపీపీ అడ్వాల రమేష్, మండల నాయకులు లక్ష్మణ్, గోవర్ధన్, లింగాగౌడ్, రమణ గౌడ్, వేణుగౌడ్, గంగాధర్ తో పాటు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు భారీగా నామినేషన్లు

- **సర్పంచ్ స్థానాలకు 84, వార్డు స్థానాలకు 230 నామినేషన్ల స్వీకరణ**

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 28: హనుమకొండ జిల్లాలోని మూడు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థుల నుండి అధికారులు నామినేషన్ పత్రాలను రెండో రోజు శుక్రవారం స్వీకరించారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో శుక్రవారం క్లస్టర్ల పరిధిలోని గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 84, వార్డు స్థానాలకు 230 నామినేషన్ పత్రాలను రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు అభ్యర్థులు శుక్రవారం సమర్పించారు. భీమదేవరపల్లి మండలం లోని గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు 37 నామినేషన్లు, వార్డు స్థానాలకు 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎల్కతుర్తి మండలంలో సర్పంచ్ స్థానాలకు 22 నామినేషన్లు, 53 వార్డు స్థానాలకు నామినేషన్లు వేశారు. కమలాపూర్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 25 నామినేషన్లు , వార్డు స్థానాలకు 77 నామినేషన్లను అభ్యర్థుల నుండి అధికారులు స్వీకరించారు. భీమదేవరపల్లి లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తహసిల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశంలతో కలిసి సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియను గురించి అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కమలాపూర్ మండలంలోని గూడూరు క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు సందర్శించి నామినేషన్లను గురించి అడిగి తెలుసుకున్నారు. కమలాపూర్ లోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు దేవేందర్ సందర్శించారు. ఇప్పటివరకు (గురు, శుక్రవారాలు కలిపి) రెండూ రోజుల్లో భీమదేవరపల్లి మండలానికి సంబంధించి సర్పంచ్ స్థానాలకు 67 నామినేషన్లు, వార్డు స్థానాలకు 122 నామినేషన్లు వచ్చాయి. ఎల్కతుర్తి మండలంలో సర్పంచ్ స్థానాలకు 42, వార్డు స్థానాలకు 58 నామినేషన్లు దాఖలయ్యాయి. కమలాపూర్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 61, వార్డు స్థానాలకు 111 నామినేషన్లు సమర్పించారు. ఈ మూడు మండలాలకు సంబంధించి ఇప్పటివరకు సర్పంచ్ స్థానాలకు 170, వార్డులకు 291 నామినేషన్లు దాఖలయ్యాయి.



కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల ఉచ్చులో పడకండి

- **దొరల పార్టీలలో బహుజనులు గెలిచినా దొరలదే ఆధిపత్యం**
- **బహుజనుల ఆత్మ గౌరవం బీఎస్పీ మాత్రమే**
- **స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ బలపరిచిన అభ్యర్థులను ఆదరించండి**
- **బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 28: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ బలపరిచిన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని బీఎస్పీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బహుజనుల వ్యతిరేక పార్టీలని, ఆ పార్టీల ఉచ్చులో పడవద్దని జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు. దొరల పార్టీలలో బహుజనులు గెలిచినా ఆదిపత్యం మాత్రం దొరలే ఉంటుందన్నారు. మూడు పార్టీలు బహుజన ప్రజలను మోసం చేస్తూ, కేవలం ఓట్ల కోసం తప్పుడు హామీలు ఇచ్చి బీసీ ,ఎస్సీ, ఎస్టీ ప్రజలను అధికారానికి దూరం చేస్తున్నాయన్నారు. బహుజన ఆత్మ గౌరవం, అధికారం కేవలం బీఎస్పీ తోనే సాధ్యమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ ,జిల్లా ఇంచార్జ్లు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, గువ్వల తిరుపతి, సోషల్ మీడియా ఇంచార్జ్ దాసరి అశోక్, నారాయణపేట అసెంబ్లీ ఉపాధ్యక్షులు రమేష్, కోశాధికారి శివకుమార్, మక్తల్ అసెంబ్లీ నాయకులు కేవీ నరసింహ, కోయిల్ కొండ మండల ఇంచార్జి వీరన్న, మండల అధ్యక్షులు గడ్డం హనుమంత్, ఉపాధ్యక్షులు వెంకటన్న, ధన్వాడ మండల అధ్యక్షులు రవి కుమార్ యాదవ్, కోశాధికారి జడల బాలరాజు, ఉట్కూర్ మండల ఇంచార్జి కొక్కు గౌతమ్, బీఎస్పీ నాయకుల అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డిసెంబర్ 1న మక్తల్‌లో సీఎం బహిరంగ సభ

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 28: మక్తల్ నియోజకవర్గంలో డిసెంబర్ 1న సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. పలు కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం సీఎం బహిరంగ సభలో పాల్గొననున్నారు. సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను, రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం పరిశీలించారు. కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, అధికారులను ఆదేశించారు.



నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 28: నామినేషన్ల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. రేగొండ గోడ పెల్లి కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటించాలని, అభ్యర్థులకు సమాన అవకాశాలను కల్పించాలని, అలాగే నామినేషన్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, శాంతి యుత వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం స్పందించాలన్నారు. 29వ తేదీన మొదటి విడత నామినేషన్లకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్ పత్రాలు అధికంగా ఉంచాలని, నామినేషన్లు వెంట వెంటనే స్కాన్ చేసి ఎన్నికల సంఘానికి పంపించేందుకు జి.పి.ఓ లను అదనపు సిబ్బందిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఖచ్చితమైన ధ్రువపత్రాలతో నామినేషన్ కేంద్రాలను సంప్రదించాలని, అవసరమైతే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని స్పష్టం చేశారు. అభ్యర్థి ఎన్నికల ఖర్చు వివరాల నమోదుకు ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని లావాదేవీలు బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే జరపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులు రవికుమార్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక ర్యాంప్ వద్ద ఉద్రిక్తత

ప్రతిపక్షం, వెంకటాపురం, నవంబర్ 28: వెంకటాపురం మండలంలోని మోర్రవాణిగూడెం (అబ్బాయిగూడెం) లోని ఇసుక ర్యాంప్ వద్ద శుక్రవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇసుక ర్యాంప్ వద్ద ఇద్దరి మధ్య తలెత్తిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చి ఘర్షణలకు దారి తీసింది. స్థానికుల సమాచారం ప్రకారం ఒక వ్యక్తిని చెప్పుతో కొట్టిన ఘటనపై ఇరువర్గాల మధ్య మాటామాటా కొనసాగి పరిస్థితి ఉద్రిక్తమైంది. ఈ సందర్భంగా ఒక మహిళపై దాడి జరిగినట్టు తెలుస్తోంది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఘర్షణకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని వెంకటాపురం పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది

- **ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయి పర్యటన చేశారు.**
- **ఇచ్చిన హామీల ప్రకారం సహాయం అందిస్తున్నాం**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

ప్రతిపక్షం, హనుమకొండ, 28: నవంబర్ నెలలో వచ్చిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలలో భాగంగా ఈ రోజు హనుమకొండ మరియు కాజీపేట మండలలో సంబదించిన వరద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన రేషన్ ని శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి బాధిత కుటుంబాలకు అందజేశారు. రెండు మండలాలకు గాను మొత్తం 57వ డివిజన్ వాజ్ పేయ్ కాలనీలో మరియు 49 డివిజన్ లోటస్ కాలనీల్లో పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో నగరంలో చాలా చోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను మరుసటి రోజే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మరియు సంబధిత మంత్రులు, అధికారులు పర్యటన చేసి జరిగిన నష్టాన్ని అంచనావేసి వరద సహాయం కింద రూ 15000 ప్రకటించారని గుర్తు చేశారు.బాధిత కుటుంబాలకు చెందిన బ్యాంకు ఖాతాల నెంబర్లు తప్పుగా ఇవ్వడం కారణంగా ఆలస్యం అయిందని ఒక్కొక్కటిగా బ్యాంకు ఖాతాలో నగదు బదిలీ సోమవారం నాటికి పూర్తి అవుతుందని తెలిపారు. 2440 మందికి నష్ట పరిహారంగా రూ.3.76 కోట్లు రూపాయలను 504 క్వింటాళ్ల రేషన్ బియ్యం అందించామని తెలిపారు.గతంలో వరదలు వస్తే ఫోటోలకు పోస్ ఇచ్చిన పరిస్థితులే తప్ప ఒక్క రూపాయి అందించిన దాఖలాలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



థాయిలాండ్‌లో మనోళ్ల గెలుపు..

- **సత్తా చాటిన బొద్ది రెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవ మూర్తి**
- **చైనా, మలేషియా క్రీడాకారులపై గెలుపు**
- **థాయిలాండ్ పై నువ్వా నేనా అన్నట్లు సాగిన పోటీ**
- **ఘనంగా సన్మానించిన తోటి క్రీడాకారులు**



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 28 : హనుమకొండకు చెందిన వెటరన్ షటిల్ క్రీడాకారులు బొద్ది రెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి థాయిలాండ్ లోని పట్టాయా మహానగరంలో ప్రతిభను చాటారు. ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ 'సవాస్ ది కప్ 2025లో రన్నరపుగా నిలిచారు. ఈ అంతర్జాతీయ షటిల్ టోర్నమెంట్లో ప్రపంచ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. 60 ప్లస్ డబుల్స్ లో ప్రభాకర్ రెడ్డి, కేశవమూర్తి జంట చైనా, మలేషియా దేశాల క్రీడాకారులపై విజయం సాధించారు. నిర్వాహక దేశమైన థాయిలాండ్ క్రీడాకారులతో నువ్వా నేనా అన్నట్లు సాగిన పోటీలో ఓటమిని చవిచూసి రన్నరప్ గా నిలిచారు. జట్టు మేనేజర్ ముచ్చ రాజిరెడ్డి ప్రోత్సాహంతో వీరి జంట అద్భుతంగా ఆడింది. థాయి చైనీస్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోర్నే దబ్బరాన్సి ఆధ్వర్యంలో పట్టాయ మహానగరంలో సవాస్ ది కప్ 2025 బ్యాడ్మింటన్ టోర్నీని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. అంతర్జాతీయ క్రీడాకారుల కోసం ఘనమైన ఏర్పాట్లను చేసింది. నభూతో నాభవిష్యత్తు అన్న రీతిలో కొనసాగిన ఈ అంతర్జాతీయ సెటిల్ క్రీడోత్సవాల్లో బోద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవ మూర్తిలు పతకాలు సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. షటిల్ టోర్నీలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వీరిని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

అభినందనల వెల్లువ..

థాయిలాండ్ లోని పట్టాయ మహానగరంలో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సవాస్ ది కప్ 2025 టోర్నీలో సమిష్టిగా రాణించి రన్నరప్ గా నిలిచిన ఓరుగల్లు షటిల్ క్రీడాకారులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవ మూర్తిని జి డబ్ల్యూ ఎంసీ ఇండోర్ స్టేడియంలో తోటి క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వీరికి శాలువా కప్పి, బొకేలు ఇచ్చి అభినందించారు. ఎంతో అట్టహాసంగా జరిగిన ఈ అభినందన సభలో కొత్తగట్టు సుధాకర్, మార్త శ్రీధర్, పూతాటి రవి, కొత్తగట్టు శివ, పూసల సంతోష్, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, చదలవాడ నితిన్, చింతాకుల ప్రభాకర్, రోహన్ సింగ్, శివ , దుస్స వినయ్, పీసు రాజిరెడ్డి, కోట రమణారెడ్డి, పూజారి విజయ్, వైవీ రాజేందర్ తో పాటు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జట్టు మేనేజర్ ముచ్చ రాజిరెడ్డి అందించిన ప్రోత్సాహం మరువలేనిది అన్నారు. వరంగల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులందరికి పేరుపేరునా వారు ధన్యవాదాలు తెలిపారు.

ముసాయిదా విత్తన బిల్లు2025 పై అభిప్రాయాల సేకరణ

- **ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ వెల్లడి**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 28 : వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన ముసాయిదా విత్తన బిల్లు 2025 పై శుక్రవారం అభిప్రాయ సేకరణ జరిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వ్యవసాయ అధికారులతో పాటు రైతు ప్రతినిధులు, విత్తన డీలర్లు, కంపెనీలు, విత్తన ఉత్పత్తిదారులతో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముసాయిదా విత్తన బిల్లులోని అంశాలపై చర్చించి వారి అభిప్రాయాలను సేకరించారు. ముసాయిదా బిల్లులో పొందుపర్చిన నాసిరకం విత్తనాల కారణంగా పంట ఉత్పత్తి, విక్రయ దశలో రైతులకు నష్టం కలిగితే నిర్ణీత కాల పరిమితితో రైతులకు చట్టబద్ధంగా నష్ట పరిహారం అందించేలా నిబంధనలపై చర్చించారు. విత్తన ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించి స్పష్టమైన, సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థను బిల్లులో చేర్చడం, పత్తి, వరి, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయలు తదితర విత్తనాల ఉత్పత్తి, విక్రయ ధరల నియంత్రణ కోసం నిబంధనలు, విత్తన విక్రయదారుల లైసెన్సింగ్ వ్యవస్థ, మార్గదర్శకాలు, సీడ్ టెస్టింగ్, విత్తనాల దిగుమతి, విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల నియంత్రణలో ఉన్న లోపాల సవరణ తదితర అంశాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ముసాయిదా విత్తన బిల్లుపై సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి



పంపిస్తామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీ-పోల్ మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి

స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల సౌలభ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టీపోల్ మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. టీపోల్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, ఓటరు స్లిప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చని అన్నారు. అలాగే టియాప్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని కూడా తెలియజేయవచ్చని అన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు ఎం.పీ.డీ.ఓలకు చేరుతాయని, వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్లే స్టోర్ నుండి ఈ యాప్ ను https://play.google.com/store/apps/details?id=com.cgg.gov.in.te_poll_telugu లింక్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.



ఖరీఫ్‌లో ఎదురైన యూరియా సమస్యలు.. ప్రస్తుత రబీ సీజన్‌లో తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రోమోర్ కేంద్రాల్లో యూరియా కొరతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 1.91 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉంది. పోర్టుల్లో మరో 1.35 లక్షల టన్నులు ఉంది. దీన్ని అన్ని జిల్లాలకు అవసరం మేరకు తరలిస్తున్నాం.

- ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు

4, 5 తేదీలలో భారత్‌కు పుతిన్


- 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 28 : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారైంది. 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు ఆయన డిసెంబర్ 4, 5 తేదీలలో భారతదేశంలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు పుతిన్ భారత్‌కు వస్తున్నారని, ఈ పర్యటన తేదీలను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. రష్యా వార్తా సంస్థ క్రెమ్లిన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఈ పర్యటనలో భాగంగా పుతిన్ ఢిల్లీలో ప్రధాని మోడీతో కీలక చర్చలు జరుపుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, వాణిజ్యం సహా పలు కీలక అంశాలపై చర్చిస్తారు. సదస్సు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రష్యా అధ్యక్షుడు పుతిన్ గౌరవార్థం ప్రత్యేక విందును ఏర్పాటు చేయనున్నారు. ఈ విందుకు ప్రధాని మోడీ, పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరవుతారు. ఈ శిఖరాగ్ర సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం లభిస్తుందని, ఇది ఉభయ దేశాల పురోగతికి ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.



విశ్వ వీక్షణం





ఆధార్ కార్డుతో బర్త్ సర్టిఫికేట్స్ జారీ రద్దు

- మహారాష్ట్ర, యూపీ ప్రభుత్వాల కీలక నిర్ణయం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 28 : ఆధార్ విషయంలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. బర్త్ సర్టిఫికేట్ జారీ కోసం ఆధార్ కార్డులను రుజువుగా ఆమోదించబోమని పేర్కొన్నాయి. ఆధార్ కార్డుకు బర్త్ సర్టిఫికేట్‌ను జోడించడం లేదని, దానిని జనన ధ్రువీకరణ పత్రంగా భావించడం లేదని యూపీ రాష్ట్ర ప్లానింగ్ శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆధార్ కార్డును జనన ధ్రువీకరణ పత్రంగా లేదా డేట్ ఆఫ్ బర్త్‌కు ప్రూఫ్‌గా ఆమోదించడం లేదని ప్లానింగ్ శాఖ స్పెషల్ సెక్రెటరీ అమిత్ సింగ్ బన్సాల్ తెలిపారు. మహారాష్ట్ర సర్కారు కూడా దాదాపుగా ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. బర్త్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు ఆధార్ కార్డును ఓ డాక్యుమెంట్‌గా ఆమోదించబోమని చెప్పింది. జనన, మరణ రిజిస్ట్రేషన్ సవరణ చట్టం 2023 తర్వాత ఆధార్ కార్డు ఆధారంగా నమోదైన బర్త్ సర్టిఫికేట్లను రద్దు చేయనున్నట్లు మహారాష్ట్ర సర్కారు వెల్లడించింది. అక్రమంగా జరుగుతున్న నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీని అడ్డుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఆధార్ కార్డులతో అనుమానాస్పద రీతిలో జారీ చేసిన అన్ని సర్టిఫికేట్లను రద్దు చేస్తున్నట్లు మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బావన్‌కులే తెలిపారు. ఇప్పటి వరకు నకిలీ జనన పత్రాలు జారీ చేసిన ఆఫీసర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామని పేర్కొన్నారు.



పోరాటం నుంచి పునర్నిర్మాణం వరకు

తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్ చరిత్రాత్మక యాత్ర

సిద్ధిపేట సద్ది మూట నుంచి తెలంగాణ సచివాలయం దాకా కేసీఆర్ నాయకత్వం

11 రోజుల దీక్షతో ప్రారంభమైన తెలంగాణ పునరుత్థానం ఉద్యమం, త్యాగం, నిర్మాణం... కేసీఆర్ పాత్ర

జలధారల నుంచి సంక్షేమధారల వరకు: కేసీఆర్ ఆర్ దశాబ్దం

ఒక నాయకుడి సంకల్పం: తెలంగాణ కథ

తెలంగాణ ఉద్యమం చరిత్ర అనేది కేవలం రాజకీయ పరిణామాల సమాహారం కాదు. అది ఒక ప్రాంతపు మనుగడ, గౌరవం, స్వాభిమానాన్ని తిరిగి సాధించుకునే మహత్తర ప్రజా యాత్ర. ఈ దీర్ఘ పోరాటానికి దిశా నిర్దేశం చేసి, ప్రజా భావోద్వేగాన్ని రాజకీయ దిశగా మలచిన నాయకుడిగా నిలిచింది కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వం. తొలి రోజుల నుంచి ఆయన ప్రయాణం ప్రజల నమ్మకంపై నిలిచినది. సిద్ధిపేటలో పేద కుటుంబంలో పెరిగి, ప్రజల సద్ది మూటలతో రాజకీయ పయనం ప్రారంభించిన ఆయనకు ప్రజా సమస్యలపై అవగాహన, పల్లె జీవనంపై ప్రేమ, అన్యాయంపై కోపం ఇవన్నీ చిన్నప్పుడే అంకిత భావంగా కలిశాయి. ఇవే ఆయనను ప్రజల హృదయాల్లో నిలబెట్టిన శక్తిగా మారాయి.



2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు ఉద్యమానికి కొత్త దిశ లభించింది. గ్రామాల వెంటే నడిచి, నీటి సమస్యలపై "జల సాధన యాత్రలు" ప్రజల జీవనాన్ని అర్థం చేసుకునే "పల్లె బాట" దేశ దృష్టిని తెలంగాణపై కేంద్రీకరించిన "మిలియన్ మార్చ్", "సాగర హారం" వంటి పోరాటాలతో ఉద్యమం ఉధృతమైంది. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, రైతులు అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన జేఏసీ ఉద్యమానికే కేంద్రమవగా, సకల జనుల సమ్మె రాష్ట్రాన్ని పూర్తిగా స్తంభింపజేసి భారీ నిరసనగా చరిత్రలో నిలిచింది.

ఈ ఉద్యమ ప్రస్థానంలో అత్యంత భావోద్వేగ భరితమైన అధ్యాయం అమరుల త్యాగం. తెలంగాణ కోసమే ప్రాణత్యాగం చేసిన వందలాది యువకులు, విద్యార్థులు, కూలీలు, రైతుల త్యాగం ఉద్యమానికి హృదయం అయింది. "మా బిడ్డ ప్రాణం తెలంగాణ కోసం పోయింది" అని చెప్పిన తల్లిదండ్రుల ఆవేదన ఉద్యమాన్ని మరింత శక్తివంతం చేసింది. అమరుల రక్తం ప్రజా గళానికి శక్తి, వారి ఆత్మాహుతి తెలంగాణ సాధనకు ఇంధనం. అందుకే తెలంగాణ ఏర్పడిన రోజున "అమరుల రక్తం వృథా కాలేదు" అనే మాట ప్రతి తెలంగాణ మనసులో ప్రతిధ్వనించింది. అంబేద్కర్ సచివాలయం ముందు నిత్యం వెలిగే అమర వీరుల స్మారక జ్యోతి ఆ త్యాగానికి శాశ్వత సాక్ష్యంగా నిలిచింది. ఆ జ్యోతి కేవలం కాంతి కాదు. అది తెలంగాణ ఆత్మకు ప్రతీక. తెలంగాణ కోసం ప్రాణాలను అర్పించిన అమరుల బాధ్యతను తన భుజాలపై వేసుకుని, ఆ త్యాగాలను నిలబెట్టడం తన జీవిత లక్ష్యమని కేసీఆర్ పలుమార్లు భావోద్వేగంతో వెల్లడించారు. "ఈ రాష్ట్రం అమరుల రక్తంతో ఏర్పడింది... వారి త్యాగం వృథా కాకూడదు" అనే ధృఢ సంకల్పమే కేసీఆర్ నాయకత్వానికి ప్రాణం. తెలంగాణ ఉద్యమంలో ప్రతి అమరుని కథ హృదయంలో కొరికి వేసిన పట్టు లాంటిదని ఆయన స్పష్టంగా వ్యక్తపరిచారు.

2009 నవంబర్ 29న ప్రారంభమైన ఆయన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని మలుపు తిప్పింది. రోజు రోజుకూ ఆరోగ్యం క్షీణిస్తున్నా.. అమరుల త్యాగం ముందు ఆయన తన బాధను మరచి పోయాడు. ప్రజల్లో ఆందోళన అల్లకల్లోలంగా మారి, విద్యార్థుల



ఆగ్రహం, ఉద్యోగుల సమైక్యత దేశ దృష్టిని తెలంగాణపై నిలిపాయి. చివరకు కేంద్రం రాష్ట్ర నిర్మాణ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు డిసెంబర్ 9 అర్థరాత్రి ప్రకటించింది . కానీ తెల్లవారేసరికి ఆంధ్ర నేతలు కుట్రలు చేశారు. దీంతో కేసీఆర్ తెలంగాణ జెఏసి ఏర్పాటు చేసి మళ్ళీ తెలంగాణ యావత్తును ఏకం చేశారు. దీంతో కేంద్రం తలొగ్గి ఉభయ సభల్లో తెలంగాణ రాష్ట్ర విభజన బిల్లును పాస్ చేసింది.

2014 జూన్ 2న తెలంగాణ అవతరించడం ఈ మహా పోరాటానికి దక్కిన విజయం. రాష్ట్రం వచ్చినంత మాత్రాన పోరాటం ముగియలేదు. నిర్మాణయాత్ర మొదలైంది. మొట్టమొదటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేపట్టిన పరిపాలన పునర్నిర్మాణం, పునరుత్థానం, పునర్వ్యవస్థీకరణ దిశగా సాగింది. జలవనరుల రంగంలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, భక్త రామదాసు వంటి భారీ ప్రాజెక్టులు తెలంగాణ వ్యవసాయాన్ని తిరిగి నిలబెట్టాయి. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ వంటి రిజర్వాయర్లు భవిష్యత్తు నీటి భద్రతకు పునాది రాళ్ళుగా నిలిచాయి.

నూతన సచివాలయం ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. అంబేద్కర్ విగ్రహం సామాజిక న్యాయం పట్ల తెలంగాణ ప్రభుత్వ నిబద్ధతను చాటింది.

సంక్షేమ పాలనలో కేసీఆర్ ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, పెన్షన్ల విస్తరణ, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు దేశవ్యాప్త ప్రశంసలు పొందాయి. పల్లె అభివృద్ధి నుంచి విద్య, వైద్యం వరకు రాష్ట్రం భారీ మార్పులను చూచింది. వీటిని చూసినప్పుడు తెలంగాణ పోరాటం కేవలం రాష్ట్రం కోసం చేసిన ఉద్యమం కాదు; రాష్ట్రం సాధించిన తర్వాత దాన్ని ఎలా తీర్చిదిద్దాలో చూపిన పునర్నిర్మాణ యాత్ర అని స్పష్టం అవుతోంది. సిద్ధిపేట సద్ది మూటతో ప్రారంభమైన ఒక యువకుడి ప్రయాణం, ఆమరణ దీక్షతో చరిత్రను మార్చిన నాయకత్వం, అమరుల త్యాగాలతో నిలిచిన ప్రజా ఉద్యమం, నూతన రాష్ట్ర నిర్మాణం వరకు సాగిన అపూర్వ గాథ

...ఇవన్నీ తెలంగాణ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి.

ఈ చరిత్రను తరతరాలకు చేరవేయడం కేవలం బాధ్యత కాదు. ఇది తెలంగాణ ఆత్మను నిలబెట్టే పునీత సంస్కార యాత్ర.

చిటుకుల మైసారెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్,
9490524724



తండ్రి బ్రతికే ఉన్నాడనే ఆధారాలు చూపండి

- ఇమ్రాన్ ఖాన్ కొడుకు ఖాసిమ్ ఖాన్ డిమాండ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 28 : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలులో చనిపోయినట్లు పుకార్లు వ్యాపిస్తున్న నేపథ్యంలో ఆయన కుమారుడు ఖాసిమ్ ఖాన్ స్పందించారు. తన తండ్రి బ్రతికే ఉన్నాడన్న ఆధారాలు చూపాలని, తక్షణమే ఆయన్ను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు పెట్టారు. తన తండ్రిని 845 రోజులుగా నిర్బంధించారని ఆ పోస్టులో ఖాసిమ్ పేర్కొన్నాడు. ఇక గడిచిన ఆరు వారాల నుంచి ఇమ్రాన్‌ను డెత్ సెల్‌లో వేశారని, ఫ్యామిలీతో అతను కాంటాక్ట్‌లో లేదని తెలిపారు. కోర్టు ఆదేశాలు జారీ చేసినా, సోదరీమణులను కలుసుకునేందుకు అడియాలా జైలు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని ఖాసిమ్ ఆరోపించారు. ఫోన్ కాల్స్ లేవని, విజిటర్స్ లేరని, అతని ఆరోగ్యం గురించి కూడా ఎటువంటి సమాచారం లేదని అన్నారు. తన తండ్రి పరిస్థితిని కావాలని అధికారులు కప్పిపుచ్చుతున్నారని, ఇందుకు అధికారులదే పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు జోక్యం చేసుకోవాలని ఖాసిమ్ అభ్యర్థించాడు.

డ్రగ్స్ అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై చర్యలు

- వెనిజులాకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 28 : వెనిజులాకు చెందిన మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై చర్యలు తీసుకోవడానికి అమెరికా సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అతిత్వరలోనే వెనిజులా భూభాగంలో ఆపరేషన్లు చేపడతామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి సముద్రం మీదుగా ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతోందని, వాటిని ఆపడానికి భూభాగంపై నుంచే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికైనా తమ దేశంలోకి మాదక ద్రవ్యాలు సరఫరా చేయడాన్ని ఆపాలని వెనిజులాకు మరోసారి హెచ్చరిక చేశారు. అమెరికా ఇప్పటికే కరేబియన్ సముద్రంలో భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది. అమెరికా దళాలు జరిపిన దాడులలో 80 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటనతో ఏ క్షణమైనా అగ్రరాజ్యం వెనిజులా భూభాగంపై దాడిచేసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వెనిజులాలో అమెరికా దళాలు చొరబడవచ్చని ప్రచారం జరుగుతోందని, అక్కడి ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ ఇటీవల స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు.




అఫ్గాన్‌పై మారుతున్న పాకిస్తాన్ వైఖరి

- ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు

లాహోర్ (పాకిస్తాన్), నవంబర్ 28: ఇంతకాలం పాకిస్తాన్ దేశం అఫ్గానిస్తాన్‌పై అనుకూల వైఖరితో ఉంది. తాము చెప్పినట్లు చేస్తుందని భావించింది. కానీ, కొన్ని నెలలుగా ఆఫ్గానిస్తాన్-భారత్ సంబంధాలు మెరుగుపడుతున్నాయి. దీనిని దాయాది దేశం జీర్ణించుకోలేకపోతోంది. అందుకే తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ ఉగ్రవాదుల సాకుతో అఫ్గాన్‌పై దాడులు చేస్తోంది. తాజాగా మరోమారు దాడికి తెగబడింది. గతంలో అఫ్గాన్ విదేశాంగ మంత్రి భారత్‌లో ఉండగా పాకిస్తాన్ దాడులు చేపట్టింది, తాజాగా అఫ్గాన్ వాణిజ్య మంత్రి భారత్‌కు వచ్చిన సందర్భంలో ప్రతికూల ప్రభావం చూపడానికి ప్రయత్నిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. అఫ్గాన్‌కు వైమానిక దళం లేదు. ఇదే అదునుగా గతంలో పాకిస్తాన్ వైమానిక దాడులు చేసింది. దీంతో పాకిస్తాన్ ప్రతిదాడి చేసింది. అఫ్గాన్ సైన్యాలు పాకిస్తాన్ సరిహద్దులోని పాకిస్తాన్ ట్యాంకులను అపహరించింది. 90 మంది పాకిస్తాన్ సైనికులను బంధించింది. దీంతో ఖతార్, టర్కీ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరిగేలా చూపాయి. ఇప్పటివరకు పాకిస్తాన్ వైమానిక దాడులలో 9 మంది పిల్లలు, ఒక మహిళ సహా మంది అమాయకులు మృతి చెందారు. ఈ దాడి వల్ల అఫ్గానిస్తాన్ తీవ్ర ఆగ్రహంతో ఎదురుదాడికి సిద్ధమవుతోంది. ఆఫ్గాన్ సంస్కృతిలో 'బాదల్' అనే రూల్ అంటే ప్రతీకారం తప్పనిసరిగా తీర్చుకోవాల్సిన విధానమని భావిస్తారు. మరో 'నాంగ్' రూల్ లో వ్యక్తి గౌరవంపై హృదయపూర్వక కట్టుబాటు ఉంటుంది. ఈ సాంప్రదాయాలు పాకిస్తాన్‌కు కఠిన గుణపాఠాలు చెప్పడానికి అఫ్గాన్ సిద్ధమని స్పష్టంగా హెచ్చరించింది.





ఛాన్స్ ఎవరికి..?

దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం టీమ్ఇండియా సిద్ధమైంది. ఆదివారం నుంచి మొదలుకానున్న మూడు వన్డేల సిరీస్ కోసం సన్నద్ధమవుతున్నది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే అందుబాటులో ఉన్న సిరీస్‌ల ఆధారంగా ప్లేయర్లను ఎంపిక చేసుకోవాలని చూస్తున్నది. ముఖ్యంగా వికెట్ కీపర్, బ్యాటర్‌గా కేఎల్ రాహుల్, రిషబ్ పంత్‌లో ఎవరికి బెర్తు ఇవ్వాలనే దానిపై ఆలోచన చేస్తున్నది. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో జట్టుకు రాహుల్ నాయకత్వం వహిస్తుండగా, పంత్ కెప్టెన్సీలో ఈమధ్యే రెండో టెస్టులో ఘోర ఓటమి చవిచూసింది. దీనికి తోడు చెత్త షాట్లకు పోయి వికెట్లు ఇచ్చుకోవడంతో పంత్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ కీపర్, బ్యాటర్‌గా రాహుల్‌ను తీసుకుంటే అప్పుడు పంత్ కేవలం మిడిలార్డర్ బ్యాటర్‌గానే తీసుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా కీపర్‌గా పంత్‌కు అవకాశమిస్తే..రాహుల్ బ్యాటర్‌గా రావాల్సి ఉంటుంది. దీంతో ఆల్‌రౌండర్ స్థానానికి ఎసరు వస్తుంది. ఆల్‌రౌండర్ల విషయానికొస్తే నితీశ్‌కుమార్‌రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై మేనేజ్‌మెంట్ ఇంకా నిర్ణయానికి రాలేదని తెలుస్తున్నది.



టీ 20 ట్రయాంగిల్ సిరీస్.. ఫైనల్లో శ్రీలంక

ముక్కోణపు టీ20 సిరీస్‌లో శ్రీలంక ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన తమ ఆఖరి లీగ్ పోరులో పాకిస్థాన్‌పై 6 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. లంక నిర్దేశించిన 185 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన పాక్ 20 ఓవర్లలో 178/7 స్కోరుకు పరిమితమైంది. దుష్మంత చమీర (4/20) వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్‌లో విజయానికి 10 పరుగులు అవసరమైన దశలో చమీర..మూడు పరుగులే ఇచ్చి ఫహీమ్ అష్రఫ్(7) వికెట్ తీసి లంక ఉత్కంఠ విజయంలో కీలకమయ్యాడు. తన బౌలింగ్ వైవిధ్యంతో పాక్ ఆఖరి వరుస బ్యాటర్లను కట్టుదిట్టం చేస్తూ చమీర..లంకకు విజయాన్ని కట్టబెట్టాడు. కెప్టెన్ సల్మాన్ ఆగా (63 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించినా సహచరులు విఫలమయ్యారు. ఇషాన్ మలింగ (2/54)కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత లంక 20 ఓవర్లలో 184/5 స్కోరు చేసింది. కమిల్ మిశారా (76) అర్ధసెంచరీతో రాణించాడు. అబ్రార్ అహ్మద్ (2/28) రెండు వికెట్లు తీశాడు.



ఆసియా కప్ స్క్వాడ్‌లో వైభవ్..

- మళ్లీ ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్థాన్..!

ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ కి వరుసగా అవకాశాలు వస్తున్నాయి. జూనియర్ స్థాయిలో మెరుపు శతకాలతో అదరగొడుతున్న ఈ యంగ్‌స్టర్ అండర్ 19 ఆసియా కప్ స్క్వాడ్‌కు ఎంపికయ్యాడు. దోహా వేదికగా డిసెంబర్ 12 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. దాంతో.. శుక్రవారం ఆయుశ్ మాత్రే కెప్టెన్‌గా 15 మందితో కూడిన పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. విహాన్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. భారత యువ కెరటం ఆయుశ్ మాత్రే మరోసారి జూనియర్ జట్టును నడిపించనున్నాడు. ఈమధ్యే ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలో పర్యటించిన టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఈ ముంబై కుర్రాడు అండర్ 19 ఆసియా కప్ కోసం సారథిగా ఎంపికయ్యాడు. వైభవ్, విహాన్, వేదాంత్‌లతో టాపార్డర్ పటిష్టంగా ఉంది. ఒకవేళ ఎవరైనా గాయపడితే బ్యాకప్ కోసం నలుగురు స్టాండ్ బైలను కూడా తీసుకున్నారు సెలెక్టర్లు. మరో ముఖ్యమైన విషయం.. భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. దాయాదుల మ్యాచ్ డిసెంబర్ 15న స్థానిక ఐసీసీ అకాడమీలో జరగనుంది. వచ్చే ఏడాది జింబాబ్వే ఆతిథ్యమిస్తున్న అండర్ 19 ప్రపంచకప్ పోటీలకు ఆసియా కప్ సన్నాహక టోర్నీగా ఉపయోగపడనుంది. అందుకని రైజింగ్ ఆసియా కప్‌లో 34 బంతుల్లోనే సెంచరీతో చెలరేగిన వైభవ్ మళ్లీ దంచేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఆసియా కప్ పట్టేసి వరల్డ్ కప్ ఫేవరెట్‌గా బరిలోకి దిగాలని టీమిండియా భావిస్తోంది.

అండర్ -19 ఆసియా కప్ స్క్వాడ్ :

ఆయుశ్ మాత్రే(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా(వైస్ కెప్టెన్), వేదాంత్ త్రివేది, అభిగ్యాన్ కుందు(వికెట్ కీపర్), హర్వన్ష్ సింగ్ (వికెట్ కీపర్), యువరాజ్ గోహిల్, కనిష్త్ చౌహన్, ఖిలాన్ పటేల్, నమన్ పుష్పక్, దీపేశ్, హెనిల్ పటేల్, కిషన్ కుమార్ సింగ్, ఉద్ధవ్ మోహన్, అరోన్ జార్జ్.



హైదరాబాద్ తొలి ఓటమి

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో హైదరాబాద్‌కు తొలి ఓటమి ఎదురైంది. శుక్రవారం జాదవ్‌పూర్ యూనివర్సిటీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో మహారాష్ట్ర చేతిలో ఓటమిపాలైంది. హైదరాబాద్ నిర్దేశించిన 192 పరుగుల లక్ష్యాన్ని మహారాష్ట్ర రెండు వికెట్లు కోల్పోయి 18.4 ఓవర్లలోనే విజయాన్నందుకుంది. ఓపెనర్లు అర్శిన్ కులకర్ణి(54 బంతుల్లో 89 నాటౌట్, 12ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ పృథ్వీషా(36 బంతుల్లో 66, 9ఫోర్లు, 3సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలకమయ్యారు. పసలేని హైదరాబాద్ బౌలింగ్‌కు తోడు పేలవ ఫీల్డింగ్‌ను అనుకూలంగా మలుచుకుంటూ షా ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగాడు. కులకర్ణితో కలిసి తొలి వికెట్‌కు 117 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. గత ఐపీఎల్‌లో అమ్ముడుపోని షా..ఈసారి ఎలాగైనా ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నాడు. రక్షణ్‌రెడ్డి, అజయ్‌దేవ్ ఒక్కో వికెట్ తీశారు. తొలుత కెప్టెన్ మిలింద్(35 నాటౌట్), తనయ్ త్యాగరాజన్(32) రాణించడంతో హైదరాబాద్ 20 ఓవర్లలో 191/8 స్కోరు చేసింది. జలజ్ సక్సేనా(2/25) రెండు వికెట్లు తీశాడు.



డిసెంబర్ 1 నుంచి 'సావిత్రి మహోత్సవ్'

మహానటి సావిత్రి తొంభైయ్యవ జయంతి వేడుకలను రవీంద్రభారతిలో డిసెంబర్ 1 నుంచి 6వరకు 'సావిత్రి మహోత్సవ్' పేరిట నిర్వహించబోతున్నామని సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. కళాసంస్థ 'సంగమం' ఫౌండేషన్‌తో కలిసి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో సావిత్రి సినిమాల ప్రదర్శన, పాటల పోటీలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. 'డిసెంబర్ 6న జరిగే జయంతి సభలో 'మహానటి' చిత్ర దర్శకనిర్మాతలు నాగ్‌అశ్విన్, ప్రియాంకదత్, స్వప్నాదత్‌లను, 'సావిత్రి క్లాసిక్స్' పుస్తక రచయిత సంజయ్ కిషోర్, ప్రచురణకర్త బొల్లినేని కృష్ణయ్యలను ప్రత్యేకంగా సత్కరిస్తున్నాము. మండలి బుద్ధప్రసాద్‌గారి అధ్యక్షతన జరిగే ఈ సభకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుగారు ముఖ్య అతిథిగా హాజరవుతారు' అని విజయచాముండేశ్వరి తెలిపారు.



'అర్జునుడి గీతోపదేశం'

రాజు వెడ్స్ రంబాయి ఫేమ్ అఖిల్ రాజ్ & దివిజ ప్రభాకర్, ఆదిత్య శశికుమార్, సదన్, వసంతిక మచ్చ, హీరో హీరోయిన్స్ గా రూపొందుతున్న చిత్రం అర్జునుడి గీతోపదేశం. వరలక్ష్మి శరత్ కుమార్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తున్నారు. సతీష్‌గోగాడని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఫస్ట్ కట్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్ పై త్రిలోక్ నాథ్ కాళిశెట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 80% షూట్ హైదరాబాద్, రాజమండ్రి, అమలాపురం పరిసర ప్రాంతాల్లో జరిగింది. ఆఖరి షెడ్యూల్ డిసెంబర్ లో మొదలవుతుందని చిత్ర నిర్మాత త్రిలోక్ నాథ్ కాళిశెట్టి తెలిపారు. ఈ చిత్రంలో ఆదిత్య శశికుమార్, సదన్, వసంతిక మచ్చ, రాజీవ్ సాలుర్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.




'అఖండ 2' లో సనాతన ధర్మ పరాక్రమం చూస్తారు

ప్రీరిలీజ్ ఈవెంట్ లో నందమూరి బాలకృష్ణ

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. టీజర్, ట్రైలర్ సాంగ్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. 'అఖండ 2: తాండవం' 2D, 3D రెండు ఫార్మాట్లలో డిసెంబర్ 5, 2025న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. భారీ సంఖ్యలో అభిమానులు హాజరైన ఈ వేడుక అద్భుతంగా జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. "ఇన్ని కోట్ల మంది అభిమానుల ప్రేమను పొందడం పూర్వజన్మ సుకృతం. మనది జన్మజన్మల అనుబంధం. మనిషి నిత్యవసర వస్తువులనే సినిమాని కూడా ఎంచుకున్నాడు. అలాంటి సినిమా ఎలా ఉండాలని చలనచిత్ర పరిశ్రమ పెద్దలు ఆలోచించాలి. మొన్ననే గోపీచంద్ దర్శకత్వంలో ఒక సినిమాని ప్రారంభించాం. 'చరిత్రలో చాలామంది ఉంటారు. చరిత్రని మరలా మరలా తిరిగి రాసి సృష్టించేవాడు ఒకడే ఉంటాడు. నేనే ఈ చరిత్ర నాదే ఆ చరిత్ర' ఆ సినిమాలోని డైలాగ్ ఇది. మంచి మంచి టెక్నీషియన్స్ తో పని చేయడం నా అదృష్టం. సినిమా అంటే ఒక ఆత్మ. ఆ ఆత్మని పట్టుకోవాలి. నేనెప్పుడూ కూడా అభిమానుల గురించి ప్రేక్షకుల గురించి ఆలోచిస్తూ ఉంటాను. మంచి సినిమా ఇవ్వాలి మంచి సందేశం ఇవ్వాలి పయత్నిస్తుంటాను. మహా శివుడు శక్తి, ఆదిశక్తి సాక్షిగా గంగమ్మ తల్లి ఆశీర్వాదంతో చెబుతున్నాను. ఈ రుద్ర తాండవ విన్యాసం నాలో ఆవేశమై, ఆ త్రినేత్రుడి వీక్షణ దృష్టి నాలో నిక్షిప్తమై, ఆయన త్రిశూలం నా ఆయుధానికి శక్తి శూలమై.. ఎలా ఉండబోతుందో నా పాత్ర మీరు తెరపై చూస్తారు. బోయపాటి నేను ఏదైనా సినిమా చేయాలనుకుంటే మూడే నిమిషాలు మాట్లాడుకుంటాం. ఆ మహా యజ్ఞంలోకి దిగిపోతాం. సనాతన ధర్మం గురించి చాలా బాగా చెప్పారు, సనాతనం ధర్మం శక్తి గౌరవం పరాక్రమాన్ని ఈ సినిమాలో ఎంతో అద్భుతంగా చూపించారని అభినందించారు. సనాతన ధర్మం మనదే భారతదేశానికి మూలాలు. ఆది పినిశెట్టి చాలా చక్కని పాత్ర చేశారు. నేను వాళ్ళ నాన్న గారితో కూడా సినిమాలు చేశాను. సంగీతం రోగాలను నయం చేస్తుంది. సంగీతం బాగుంటే ఆ సినిమా హిట్ అయినట్టే. ఈ సినిమా హిట్ కాదు పేలిపోతున్నాయ్. తమన్ అంత అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఇదంతా ఒక సమిష్టి కృషి. తమన్ తో చేసిన నాలుగు సినిమాలు వరుసగా హిట్లు. ఇప్పుడు అఖండ 2 కూడా అద్భుతమైన విజయం సాధించబోతోంది. మురళీమోహన్ ఇందులో చాలా అద్భుతమైన పాత్ర చేశారు. సినిమా అద్భుతంగా వచ్చింది. ఫైట్ మాస్టర్ రామ్ లక్ష్మణ్ చాలా అద్భుతమైన పోరాటాలు సమకూర్చారు. ఈ సినిమాని జార్జియాలో చాలా చలి ప్రదేశాల్లో ఎలా ఎన్నో అద్భుతమైన లొకేషన్స్ లో షూట్ చేశాం. ఈ సినిమాకి హిందీలో డబ్బింగ్ కూడా నేనే చెప్పాను. ఈ సినిమాలో పని చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరు నా అభినందనలు."అన్నారు.

45 యేండ్ల తర్వాత తెలుగు మూవీలో

బాలీవుడ్ అగ్ర నటుడు అనిల్ కపూర్ బాపు 'వంశవృక్షం'(1980) సినిమాలోతొలిసారి తెలుగుతెరపై కనిపించారు . ఆ తర్వాత బాలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా ఎదిగిన ఆయన.. ప్రస్తుతం క్యారెక్టర్ నటుడిగా బిజీ. రీసెంట్‌గా 'యానిమల్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను కూడా అలరించిన అనిల్ కపూర్.. 45ఏండ్ల విరామం తర్వాత మళ్లీ డైరెక్ట్ తెలుగు సినిమాలో నటించనున్నారు. ఆ సినిమా మరేదోకాదు.. ఎన్టీఆర్ 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్). ఎన్టీఆర్ నటజీవితంలోనే గొప్ప సినిమాగా 'డ్రాగన్'ని మలిచేందుకు సర్వశక్తులను ఒడ్డుతున్నారు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఇప్పటికే చాలావరకు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్‌కు సిద్ధం అవుతున్నది. ఈ షెడ్యూల్‌లోనే అనిల్ కపూర్ జాయిన్ అవుతారట. ఇందులో ఆయన కీలకపాత్రను పోషిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. డిసెంబర్‌లో మొదలుకానున్న ఈ షెడ్యూల్‌లో అనిల్‌కపూర్‌పై కీలక సన్నివేశాలను తీస్తారట ప్రశాంత్‌నీల్. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.





కొత్త ప్రేమకథ 'లవ్ డేస్'

నవీన్, కుసుమ చందక జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ డేస్'. సురేష్ లంకలపల్లి దర్శకుడు. మాదల వెంకట కృష్ణప్రసాద్ నిర్మాత. శుక్రవారం చిత్ర టైటిల్ గ్లింప్స్‌ని సీనియర్ దర్శకుడు వి.సముద్ర విడుదల చేశారు. నేటి యువతకు కనెక్ట్ అయ్యే ట్రెండీ లవ్‌స్టోరీ ఇదని దర్శకుడు తెలిపారు. వినూత్నకథ ఇదని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వెంగీ, మాటలు: జి.రాంప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సురేష్‌లంకలపల్లి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200